మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

# అణు భద్రతను తీసుకువచ్చిన ధీర వనిత ఆమె

## ఇందిరా గాంధీకి నివాళులర్పించిన మంత్రి జూపల్లి



మాజీ ప్రధాని ఇందిరా గాంధీ చిత్రపటానికి నివాళి అర్పించిన మంత్రి జూపల్లి కృష్ణారావు

**కొల్లాపూర్,నవంబరు 19 ప్రభాతవార్త :** మాజీప్రధాని స్వర్గీయ ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా పర్యాటక,సాంస్కృతిక,ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు నివాళులర్పించారు. బుధవారం కొల్లాపూర్ మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఇందిరా గాంధీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయం, ఆర్థిక వ్యవస్థ లేదా సైనిక శక్తి ఏదైనా సరే, భారతదేశాన్ని బలమైన దేశంగా మార్చడంలో ఇందిరా గాంధీ చేసిన కృషి సాటిలేనిదని అన్నారు. దేశం కోసం ప్రజల సౌకర్యార్థం 1969 లో బ్యాంకులను జాతీయాకరణ చేసి జాతికి అంకితం చేశారన్నారు. అదేవిధంగా జాతీయ ఆహార భద్రతను తీసుకువచ్చిన ఘనత ఆమెకే దక్కుతుందన్నారు. గరీబ్ హటావో నినాదంతో ముందుకు వెళ్లారన్నారు. దేశ రక్షణ కోసం అణు భద్రతను తీసుకువచ్చిన ఆమె ధీర వనిత అన్నారు. భారతదేశం కోసం ప్రాణత్యాగంచేసిన ఆమె సేవలు చిరస్మరణీయమైనవి అని కొనియాడారు. ఇందిరమ్మను ఆదర్శంగా తీసుకుని ఆమె ఆశయ సాధనకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా రాష్ట్రంలో కోటి మంది మహిళలకు కోటి చీరల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టడం హర్షనీయమని అన్నారు.



సంతకం చేస్తున్న జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

## బాలల బంగారు భవిష్యత్తుకు

# బాటలు వేయాలి

### నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్

**నారాయణ పేట, నవంబరు 19 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లాలోని బాలల బంగారు భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. నేటి బాలలే రేపటి భావి భారత పౌరులని ఆమె పేర్కొన్నారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ–జిల్లా బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాల సందర్భంగా బుధవారం కలెక్టరేట్‌లో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ స్ఫూర్తిదాయక అభిప్రాయంతో సంత కం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలల హక్కుల రక్షణలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, డిప్యూటీ కలెక్టర్లు శ్రీరామ్ ప్రణీత్, ఫణికుమార్, ఎస్‌డీసీ రాజేందర్ గౌడ్, మిషన్ భగీరథ ఈఈ రంగారావు, డీపీఆర్వో ఎంఏ రషీద్ తదితర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. డిసిపివో కరిష్మా, చైల్డ్ హెల్ప్‌లైన్ సమన్వయకర్త నర్సింహులు, జిల్లా బాలల సంరక్షణ సిబ్బంది, చైల్డ్ హెల్ప్‌లైన్, సఖి సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

## రైతులకు న్యాయమైన ధరకై

# ప్రభుత్వం కట్టుబడి ఉంది

### -ఎమ్మెల్యే కూచకుళ్ళ రాజేష్‌రెడ్డి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి,నవంబర్ 19 ప్రభాతవార్త:** రైతులకు న్యాయమైన ధర అందించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే కూచకుళ్ళ రాజేష్‌రెడ్డి తెలిపారు. తాడూరు మండల కేంద్రంలో మరియు నెల్లికుదూరు గ్రామంలో పీఏసీఎస్ వారి ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర ప్రకారం ఈ కొనుగోలు కేంద్రాల్లో సీ గ్రేడ్ వరికి క్వింటాల్‌కు రూ. 2389,అలాగే సాధారణ రకం (ఎ గ్రేడ్) వరికి రూ.2369 చొప్పున చెల్లిస్తున్నట్లు ఎమ్మెల్యే వివరించారు. రైతులు ఎలాంటి మధ్యవర్తులపై ఆధారపడకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా తమ ధాన్యాన్ని విక్రయించుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. పంట సేకరణలో పారదర్శకత ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని, ప్రతి రైతుకు సమయానికి చెల్లింపులు జరిగేలా వ్యవస్థను పటిష్ఠం చేస్తున్నామని తెలిపారు. అలాగే ఈ సీజన్‌లో రైతులు పంట నాణ్యతపై దృష్టి పెట్టాలని, ప్రభుత్వం అందించే సౌకర్యాలను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ రమణ రావు గారు,ఛైర్మెన్ రామచంద్ర రెడ్డి గారు ,వైస్ ఛైర్మన్ వెంకట్ రెడ్డి గారు,యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వినోద్ గారు ,మాజీ కౌన్సిలర్స్, డైరెక్టర్లు, వ్యవసాయ అధికారులు, రెవిన్యూ అధికారులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వరి సాగుకు..

# వరాల జల్లు



వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

- నాడు వరి సాగు చేస్తే! ఉరి బాధ!
- నేడు ప్రజా ప్రభుత్వంలో బోనసు
- ఎక్సైజ్ టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

**చిన్నంబావి, నవంబరు 19 ప్రభాతవార్త :** రాష్ట్రంలో వరి పంట సాగు చేసిన రైతులకు ప్రజా ప్రభుత్వం నేడు ప్రతి క్వింటాల్ కు రూ. 500 బోనస్ కల్పిస్తుందని ఇది ముమ్మాటికి రైతు ప్రభుత్వం అని రాష్ట్ర ఎక్సైజ్, టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం రాత్రి చిన్నంబావి మండల పరిధిలోని వెలగొండ గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న, ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రూ.500 బోనస్ కల్పిస్తుందనీ, రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రజల మెప్పు పొందుతున్నామని అందుకే ఇటీవల జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ప్రజా తీర్పుతో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపొందడం ప్రభుత్వానికి ఊరట కలిగించిందని, త్వరలోనే రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరవేయడం ఖాయమని ఆయన అన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు మరచి సోషల్ మీడియా ప్రచారానికి పరిమితం అయ్యిందని అందుకే బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని కర్రు కాల్చి వాత పెట్టారని, పలు ఉప ఎన్నికలో కాంగ్రెస్ ను ప్రజలు విశ్వసిస్తున్నారని ఆయన అన్నారు.గత ప్రభుత్వంలో వరి సాగు చేస్తే ఊరి వేసుకోవడం రైతుల వంతు అయిందని, రైతులను పట్టించుకోకపోవడంతో కెసిఆర్ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపారని అన్నారు. ప్రస్తుతం వరి సాగు చేస్తే 500 బోనస్ కల్పించడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ రామచంద్ర రెడ్డి, మాజీ జెడ్పిటిసి కృష్ణ ప్రసాద్ యాదవ్, మాజీ సర్పంచులు బీచ్పల్లి యాదవ్, వసంత నాగరాజ్, మాజీ ఎంపిటిసి పుష్ప వెంకటేష్, మహాదేవ్ గౌడ్, నాయకులు చిదంబర్ రెడ్డి, పుల్లయ్య శెట్టి, రామస్వామి, తేజ రెడ్డి, పెరుమాళ్ళ శ్రీనివాస్, వడ్డేమన్ బిచ్చన్న, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్, జ్యోతి గౌడ్, రాజ్ కుమార్, సుధాకర్ నాయుడు, బక్కి శ్రీనివాస్, బాలకృష్ణ, వెలగొండ గ్రామ ఐకెపి లీడర్ అరుణ, బుక్ కీపర్ ప్రశాంతి, కవిత రైతులు రమేష్,సుధాకర్, సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్

## వనపర్తి మాస్టర్

# ప్లాన్ రూపకల్పన

### పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మొదటి అవగాహన

### రాబోయే 20 ఏళ్ళ వరకు భవిష్యత్తు అవసరాలు

### అంచనా : జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి, నవంబరు 19 ప్రభాతవార్త:** వనపర్తి మున్సిపాలిటీని పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా తీర్చిదిద్దడానికి మాస్టర్ ప్లాన్ అవసరమని, దాని రూపకల్పన కోసం సంబంధిత శాఖల అధికారులు, స్టేట్ హోల్డర్లు అవసరమైన వివరాలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం ఐడిఓసిలోని సమావేశ మందిరంలో డీటీసీపీ అదనపు సంచాలకులు, అమృత్ 2.0 నోడల్ అధికారి అశ్విని, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి సంబంధిత శాఖల అధికారులకు, పట్టణంలోని లైసెన్స్‌డ్ టౌన్ ప్లానర్లకు వనపర్తి మాస్టర్ ప్లాన్ రూపకల్పన అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మొదటి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వనపర్తి మున్సిపాలిటీని పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా తీర్చిదిద్దడానికి మాస్టర్ ప్లాన్ అవసరమని అన్నారు. అమృత్ 2.0 పథకం కింద వనపర్తి మున్సిపాలిటీలో జీఐఎస్( భౌగోళిక సమాచార వ్యవస్థ) ఆధారిత మాస్టర్ ప్లాన్ రూపకల్పన సమర్థవంతంగా చేపట్టాలని ఆదేశించారు. మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు – మిగతా3లో..

## వయో వృద్ధుల

# సంక్షేమానికి చర్యలు

### జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి



మాట్లాడుతున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబరు 19 ప్రభాతవార్త:** వయో వృద్ధుల సంక్షేమం కోసం చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు. అంతర్జాతీయ వయోవృద్ధుల వారోత్సవాల ముగింపు సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా సంక్షేమ అధికారిణి జరీనా బేగం ఆధ్వర్యంలో జరిగిన ముగింపు సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించి ప్రసంగించారు. ఈ సందర్భంగా వృద్ధులు జీవించిన కాలంలో తమ ఆస్తిని తమ పేరు మీదనే ఉంచుకోవాలని ఆమె సూచించారు. వృద్ధులైన తల్లిదండ్రుల ఆస్తిని పిల్లలు తమ పేరు మీదకు మార్చుకున్న తర్వాత నిర్లక్ష్యం చేసి, వారి ఆలనా పాలనా చూడని సంఘటనలు చాలా ఉన్నాయని ఆమె అన్నారు. ఆస్తిని తమ పేరు మీద బదిలీ అయ్యాక సరిగ్గా చూసుకోకపోతే ఆస్తిని తిరిగి పొందడానికి ఆర్డీవోను కాని, కోర్టును కాని ఆశ్రయించవచ్చని ఆమె అన్నారు. వృద్ధుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా అధికారులను ఆమె ఆదేశించారు. జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామాల్లో 60 ఏండ్లు దాటిన వృద్ధుల జాబితా రిజిస్టర్ ను మండల, గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉంచాలన్నారు. ప్రస్తుతం జడ్చర్ల లో ఉన్న వృద్ధాశ్రమాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని, త్వరలో మహబూబ్ నగర్ పట్టణంలో వృద్ధులకు డే కేర్ సెంటర్‌ను ప్రారంభిస్తామని, జిల్లా కేంద్రంలో ప్రభుత్వ వృద్ధాశ్రమ ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయని కలెక్టర్ తెలిపారు. అనంతరం 22 మంది సీనియర్ సిటిజన్‌లను ఆమె శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి ఇందిర, జడ్పి సిఈఓ వెంకట్ రెడ్డి, సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు జగపతిరావు, ఉపాధ్యక్షుడు రాజసింహుడు, నస్కంటి నాగభూషణం, జడ్చర్ల ఫోరం అధ్యక్షుడు నయిమోద్దీన్, నవాబుపేట అధ్యక్షుడు నర్సింహులు, జి.పాండురంగం, తదితరులు పాల్గొన్నారు.

# లిసన్ టు చిల్డ్రన్

### బాలల నుంచి సమస్యలు విని..

### విశ్లేషించి పరిష్కరించి..

### 22 ప్రాంతాల్లో కార్యక్రమం నిర్వహణ

### నేడు అంతర్జాతీయ బాలల దినోత్సవం



**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబరు 19 ప్రభాతవార్త:** జిల్లాలో నేడు(నవంబర్ 20) అంతర్జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా యూనిసెఫ్ సహకారంతో ప్రయోగాత్మకంగా లిసెన్ టు చిల్డ్రన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు. జిల్లాలో మండలాలు, నగరపాలక సంస్థ(మహబూబ్ నగర్) మున్సిపాలిటీలలో 22 లొకేషన్ లలో ఈ కార్యక్రమం నిర్వహణకు మండల విద్యా శాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. లిసెన్ టు చిల్డ్రన్ కార్యక్రమం గురించి కలెక్టర్ వివరిస్తూ బాలలకు హక్కులు ఉంటాయని, బాలలు నుండి వినడం ద్వారా వారి అభిప్రాయాలను, ఎదురయ్యే సమస్యలను గుర్తించి క్రోడీకరించి, విశ్లేషణ చేసి మహిళా,శిశు,సంక్షేమ శాఖ,పోలీస్,వైద్య ఆరోగ్య శాఖ ,విద్యా శాఖ, పంచాయతీ ,ఇతర శాఖల సమన్వయంతో వాటిని పరిష్కరించి బాలల హక్కుల రక్షణ, వేధింపుల నుంచి రక్షణ, అన్ని విధాలుగా వారి సమగ్ర అభివృద్ధికి కృషి చేయనున్నట్లు తెలిపారు.జిల్లాలో 17మండలాల్లో, మహబూబ్ నగర్ నగర పాలక సంస్థ, మూడు మున్సిపాలిటీల్లో 22 చోట్ల ఈ నెల 20న లిసెన్ టు చిల్డ్రన్ కార్యక్రమం మహిళా శిశు సంక్షేమ శాఖ, విద్యాశాఖ,పంచాయతీ శాఖ సమన్వయంతో నిర్వహించాలని సూచించారు. ఇందులో భాగంగా ప్రతి మండలం, మున్సిపాలిటీలలో నగర పాలక సంస్థ 3 చోట్ల ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.60మంది పిల్లలను వయస్సు ఆధారంగా 12 నుండి 15 సంవత్సరం మధ్య వయస్సు కలిగిన బాలురు 15 మంది ఒక గ్రూప్, బాలికలు 15 మంది ఒక గ్రూప్,16 నుండి 18 సంవత్సరం వయస్సు కలిగిన బాలురు 15 మంది ఒక గ్రూప్, బాలికలు 15 మంది ఒక గ్రూప్ మొత్తం 4 గ్రూపులను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. గ్రూప్‌కు టీచర్‌లు ముగ్గురు సంధాన కర్తలుగా వ్యవహరిస్తారని, పంచాయతీ కార్యదర్శులు, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులూ పాల్గొంటారని తెలిపారు. మండల ప్రత్యేక అధికారులు పర్యవేక్షణ చేయాలని ముగింపుకు ఎంపిడిఓలు,తహశీల్దార్‌లు మండలంలోని అధికారులు ఇతర శాఖలు కూడా పాల్గొంటారని తెలిపారు. గ్రూపులో బడిలో లేని పిల్లలు, ప్రత్యేక అవసరాలు గల పిల్లలు, అనాథలు, వలస పిల్లలు అన్ని రకాల పిల్లలతో ఏర్పాటు చేయాలని సూచించారు. సంధాన కర్తలు వారికి స్నేహ పూర్వకంగా కార్యక్రమం ఉద్దేశం వివరించి వారికి ప్రశ్నల రూపంలో ఇచ్చి వారి నుండి అభిప్రాయాలు, సూచనలు, సమస్యలు వినాలని తెలిపారు. ఇందులో మహిళా శిశు, సంక్షేమ, శాఖ, విద్యా శాఖ,పంచాయతీ శాఖలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. పిల్లలు కూడా వ్యక్తులేనని,వారి అభిప్రాయాలు స్వీకరించే ప్రక్రియ, పిల్లలు ఇచ్చే సమాచారం అమూల్యమైనది అన్నారు. పిల్లలు చెపితే వింటున్నాం వారి అనుభవాలు, సంధానకర్తలతో పంచుకుంటారు. కార్యక్రమం నిర్వహణపై ఇప్పటికే జిల్లా అధికారులు,మండల ప్రత్యేక అధికారులు, మహిళా, శిశు సంక్షేమ శాఖ, పంచాయతీ,విద్యా శాఖల సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. మున్సిపల్ కార్యాలయం,మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో సజెషన్ బాక్స్‌లు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 20న సజెషన్ బాక్స్‌లలో సలహాలు, సూచనలు, సమస్యలను పిల్లలు అందించవచ్చని తెలిపారు. అదే విధంగా హెల్ప్ లైన్,వాట్సప్ నంబర్ 9154784095 కూడా తమ సలహాలు, సూచనలు, సమస్యలు వివరించవచ్చని తెలిపారు.

# అభివృద్ధి పనులపై శ్వేతా పత్రంకు మేము సిద్ధం

### బిఆర్ఎస్‌లో తేలు కుట్టిన దొంగలు...!!

### అవినీతి పరుల పేర్లను

### బయటపెట్టిన కల్వకుంట్ల కవిత

### పాత ప్రాజెక్టులకు బొక్కలు పెట్టి పేరు

### మార్చుకోవడం సిగ్గుచేటు

### జిఓలు సరే మరి నిధులు

### ఎందుకు కేటాయించలేదు.?

### బహిరంగ సవాలు విసిరిన ఎమ్మెల్యే మేఘారెడ్డి



చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

**వనపర్తి, నవంబరు 19 ప్రభాతవార్త:** బిఆర్ఎస్ పార్టీలో పెద్దపెద్ద అవినీతి తిమింగలాలు ఉన్నాయని స్వయాన కెసిఆర్ కూతురు కల్వకుంట్ల కవిత పేర్లు బయటపెట్టిన ఇప్పటివరకు తేలు కుట్టిన దొంగల్లాగా ఏ ఒక్కరు కూడా నోరు మెదపలేదని అలాంటి అవినీతి తిమింగలాలు నేడు ప్రజల మధ్యన నీతులు వల్లించడం సిగ్గుచేటని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. బుధవారం వనపర్తి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్, సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉక్కు మహిళ, భారత దేశపు తొలి మహిళా ప్రధాని స్వర్గీయ ఇందిరాగాంధీ దేశ అభివృద్ధి కోసం ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చారని ఆమె జయంతి సందర్భంగా మనందరం ఇందిరా గాంధీ ఆశయ సాధనాల కోసం పాటుపడాలని ఆయన పిలుపునిచ్చారు. కాంగ్రెస్ హయాంలో నిర్మించిన ప్రాజెక్టులకు నేడు కొందరు నాయకులు అక్కడక్కడ బొక్కలు పెట్టి తామే సాగునీరు అందించామని గొప్పలు చెప్పుకుంటూ వారి పేర్లను మార్చుకోవడం విడ్డూరంగా ఉందని ఎమ్మెల్యే ఎద్దేవా చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కళాకారులకు సముచిత స్థానం కల్పించి గౌరవించిన ఏకైక ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజాకవి గద్దర్, అందెశ్రీ లాంటి మహానుభావులకు ప్రభుత్వపరమైన మర్యాదలను అందిస్తూ వారి కీర్తిని నలు దిక్కుల చాటినా ఘనత కేవలం కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో కళాకారులను కష్టాలకు గురిచేసి కేవలం ఆట బొమ్మలుగా మార్చారని ఆయన అన్నారు. నాటి నుంచి నేటి వరకు తెలంగాణ రాష్ట్రంలో ఇల్లు లేని నిరుపేదలకు ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించి నిర్మించి ఇచ్చిన ఘనత కేవలం కాంగ్రెస్ పార్టీ దేనిని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కంటోన్మెంట్ ఎన్నికలైన జూబ్లీహిల్స్ ఎన్నికలైనా కాంగ్రెస్ పార్టీదే గెలుపని కాంగ్రెస్ పార్టీ గెలిస్తే బుల్డోజర్ పాలన జరుగుతుందని ఎన్ని కల్లబొల్లి మాటలు చెప్పిన ప్రజలు మాత్రం కాంగ్రెస్ పార్టీ వైపే ఉన్నారని మొన్నటి ఎన్నికలు నిరూపించాయని ఎమ్మెల్యే తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన నిర్వహిస్తుందని నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత కరెంటు, మహిళల ఉచిత బస్సు సౌకర్యం, రేషన్ కార్డులు, సన్న బియ్యం, రుణమాఫీ, రైతు భరోసా, సన్న వడ్లకు బోనస్, విద్యార్థులకు 42 శాతం మెస్ చార్జీలు, ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణం లాంటి అనేక పథకాలు చేపట్టి నిరుపేదలకు అండదండగా నిలుస్తుందని ఎమ్మెల్యే అన్నారు. ఎమ్మెల్యేగా పదవీ బాధ్యతలు చేపట్టిన నాడు ఈ నియోజకవర్గానికి పెద్ద జీతగాడిలా పని చేస్తానని చెప్పానని నేటికీ అదే తరహాలో పనిచేస్తున్నానని ఎక్కడైనా ఏదైనా లోపం ఉన్న తమ దృష్టికి నేరుగా తీసుకురావాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచే అభ్యర్థులను గెలిపించాలని ఏదైనా బంధు ప్రీతితో వేరే వాళ్లకు అవకాశం కలిపిస్తే వారు అభివృద్ధికి ఆటంకాలుగా మారుతారే తప్ప వారి వల్ల జరిగేదేమీ ఉండదని దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకే ఓటు వేసి గెలిపించాలని ఆయన సూచించారు. కాంగ్రెస్ పథకాల అమలులో అధికారులు గాని ప్రజాప్రతినిధులు గాని ఎక్కడైనా అవినీతి అక్రమాలకు పాల్పడితే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో వనపర్తి మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, పెబ్బేరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షురాలు ప్రమోదిని రెడ్డి, ఉపాధ్యక్షులు విజయవర్ధన్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ పుట్టపాకుల మహేష్, వైస్ ఛైర్మన్ పాకనాటి కృష్ణయ్య, శంకర్ నాయక్, తిరుపతయ్య గౌడ్, వనపర్తి పట్టణ మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు, ఆయా మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ల్యాండ్ పేపర్స్ ను పరిశీలిస్తు బాధితులకు వివరిస్తున్న కలెక్టర్

## భూభారతి కింద దరఖాస్తు చేసుకున్న

# దరఖాస్తులను పరిశీలించాలి

### గద్వాల కలెక్టర్ బి ఎం సంతోష్

**గద్వాల టౌన్ నవంబర్ 19, ప్రభాతవార్త :** భూభారతి కింద దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల దరఖాస్తులను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి,తక్షణ పరిష్కారం పొందే విధంగా జిల్లా కలెక్టర్ సంతోష్ అధికారులను ఆదేశించారు. బుధవారం అలంపూర్ మండలంలోని ఉట్కూర్ గ్రామంలోని 151 సర్వే భూభారతి కింద పట్టు పాస్ బుక్ లేని సమస్యతో దరఖాస్తు చేసిన స్థానికులను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ పూర్తి వివరాలను సమగ్రంగా కలెక్టర్‌కి తెలియజేశారు. జిల్లాకలెక్టర్ మాట్లాడుతూ భూభారతి రూల్స్, రెగ్యులేషన్స్ ప్రకారం, పాస్ బుక్ – మిగతా3లో..

## ఎన్ఆర్ఈజీఎస్ పనులపై సామాజిక తనిఖీ

**నవాబుపేట, నవంబరు 19 ప్రభాతవార్త :** మండల పరిషత్ ఎంపీడీవో కార్యాలయంలో ఎన్ఆర్ ఈజీఎస్ అధికారులు 15వ విడత మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులపై సామాజిక తనిఖీ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ఎన్ఆర్ఈజీఎస్ ఎస్ఆర్పి రాజు 17 మంది డిఆర్పీలు హాజరయ్యారు. మండలంలోని 42 గ్రామ పంచాయతీలలో 1.04 .2024 నుంచి 31.03.2025 సంవత్సరం వరకు చేపట్టిన ఉపాధి హామీ పనులపపై సమీక్ష నిర్వహించనున్నారు. మండలంలోని అన్ని గ్రామాలలో జరిగిన ఉపాధి హామీ పథకం పనుల ఖర్చు 8 కోట్ల 92 లక్షల 12 వేల రూపాయలు, పిఆర్ 55 పనుల నిధులు 1 కోటి 60 లక్షల 59 వేల 327 రూపాయల నిధుల ఖర్చుపై మండల జిల్లా అధికారుల సమక్షంలో సామాజిక తనిఖీ నిర్వహించనున్నారు. రెండు మూడు రోజుల్లో అధికారులు గ్రామాలకు వెళ్లి ఉపాధి హామీ పనుల్లో చేసిన రెండు మూడు రోజులలో గ్రామాలలోని ఉపాధి హామీ పనుల ఖర్చులపై పర్యవేక్షణ చేసి తనిఖీ చేయనున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ జిల్లా అధికారులు స్టేట్ రిసోర్స్ పర్సన్ రాజు డిఆర్పిలు 17 మంది సిబ్బంది, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది వివిధ గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.



సామాజిక తనిఖీ పరిశీలిస్తున్న అధికారులు

## స్థలాలు లేక నిలిచిపోయిన
## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు

**మద్రిపల్లిలో స్థలం ఇవ్వడానికి ముందుకు వచ్చిన డిసిసిబి డైరెక్టర్**

**ఉప్పునుంతల, నవంబరు 19 ప్రభాతవార్త :** వాన కాలంలో రైతులు పండించిన వరి ధాన్యం కొనుగోలు చేయడానికి తెలంగాణ పౌరసరఫరల శాఖ, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వారి అధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించే కొనుగోలు కేంద్రాలు మండలంలో ఇప్పటికీ 4 కేంద్రాలు ప్రారంభించగా స్థలాలు లేక మరో 3 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు నిలిచిపోయాయి. మద్రిపల్లి, దాసర్లపల్లి, వెల్టూరు గ్రామాలలో కొనుగోలు కేంద్రాలు సొంతం స్థలం లేక కేంద్రాలు ఏర్పాటు చేయలేక పోయారు. కానీ మద్రిపల్లి గ్రామంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడానికి డిసిసిబి డైరెక్టర్, సింగిల్ విండో చైర్మన్ సత్తు భూపాల్ రావు సొంత స్థలం ఇవ్వడానికి ముందుకు వచ్చారు. తన సొంత పొలంలో ఎలాంటి పారితోషికం తీసుకోకుండా వరి ధాన్యం కొనుగోలు కేంద్రం స్థలం ఇవ్వడానికి ముందుకు వచ్చారు. గ్రామాలలో కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో దాసర్లపల్లి, వెల్టూరు గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. మద్రిపల్లి గ్రామంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసేందుకు స్థలం ఇవ్వడానికి ముందుకు వచ్చిన డిసిసిబి డైరెక్టర్, సింగిల్ విండో చైర్మన్ సత్తు భూపాల్ రావును రైతులు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

## జాతీయ స్థాయి పోటీలలో విజేతలుగా నిలవాలి

**ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్**

**మహబూబ్‌నగర్, నవంబరు 19 ప్రభాతవార్త :** జాతీయస్థాయి గో గేమ్ జూనియర్ సబ్ జూనియర్ పోటీలలో విజేతలుగా నిలవాలని మూధ చైర్మన్ కె.లక్ష్మణ్ యాదవ్ అన్నారు. ఈనెల 22వ తేదీ నుండి 24వ తేదీ వరకు ఒడిస్సా రాష్ట్రంలో జరిగే సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ గో గేమ్ జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనే తెలంగాణ జట్టు ఎంపికైన క్రీడాకా రులను ఆయన అభినందించారు. జాతీయ స్థాయి పోటీలలో క్రీడాకా రులు తమలో ఉన్నప్రతిభను కనబరిచి జాతీయ స్థాయి పోటీలలో విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గో గేమ్ ఉపాధ్యక్షులు మొహమ్మద్ షకీల్ అహ్మద్, మహబూబ్‌నగర్ జిల్లా గో గేమ్ కార్యదర్శి అఫ్రోజ్‌లు పాల్గొన్నారు. రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ..సబ్‌జూనియర్ విభాగంలో...మేహమ్మద్ సోఖాన్ గుర్దన్, సి.టి. లలితేష్, జూనియర్ విభాగంలో...పి. రాహుల్, ఛేతన్ చంద్ర, సీనియర్ విభాగంలో...పి. రాజేష్, సబావత్ వర్షిత్‌లు ఎంపికయ్యారు.



క్రీడాకారులను అభినందించిన ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్

## ఈనెల 26న మైసమ్మ ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ట

**నవాబుపేట, నవంబరు 19 ప్రభాతవార్త :** మండల పరిధిలోని కాకర్లపాడు గ్రామ పర్వతాపూర్ మైసమ్మ దేవస్థానంలో ఈనెల 24 నుండి 26 వరకు ధ్వజస్తంభ పున: ప్రతిష్ఠ కార్యక్రమ మహోత్సవం ఘనంగా జరగనుందని ఆలయ ఈవో నరసింహులు ఆలయ చైర్మన్ జగన్మోహన్ రెడ్డి, ఆలయ మాజీ చైర్మన్లు గోపాల్ కృష్ణయ్య, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు తెలియజేశారు. 24న సోమవారం గణపతి పూజ, గోవు పూజ, అంకురార్పణ గణపతి హోమం, 25న మంగళవారం నవగ్రహ, సర్వతోభద్ర మండల పూజ మహా మంగళహారతి కార్యక్రమం 26న బుధవారం ధ్వజస్తంభ పున ప్రతిష్ట కార్యక్రమం వేద మంత్రాల నడుమ ప్రతిష్ఠాపనా కార్యక్రమాలను ఆలయ ఉత్సవ కమిటీ దిగ్విజయంగా నిర్వహించనుంది అని దీనికి ముందు ప్రత్యేక పూజలను ఆలయ అర్చకులతో పాటు వేద పండితులు భక్తిశ్రద్ధలతో కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయనున్నారని ఈ సందర్భంగా వారు తెలియజేశారు. భక్తుడు ధ్వజస్తంభ దాత తిరుమలాపూర్ గ్రామానికి చెందిన కె. సంతోష్ కుమార్ తండ్రి బాలకృష్ణయ్యలు, ఆలయానికి వితరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని వారు కోరారు.

## మత్స్య కారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

**కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నరేందర్ రెడ్డి**

**చిన్న చింతకుంట, నవంబరు 19 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలోని మత్స్యకారుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నరేందర్ రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని బండర్ పల్లి గ్రామంలోని పెద్ద చెరువులో వంద శాతం సబ్సిడీతో 54వేల చేప పిల్లలను వదిలే కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడుతూ మత్స్యకారుల ఆర్థికాభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని తెలంగాణ రాష్ట్రప్రభుత్వం చేపట్టిన ఉచిత చేప పిల్లల పంపిణీ చేయడం జరిగిందన్నారు. అన్ని వర్గాల సంక్షేమానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తూ పనిచేస్తుందని ఆయన తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి స్థానిక ఎమ్మెల్యే జిఎంఆర్ అధిక నిధులు తీసుకొస్తూ ప్రజా మన్నన పొందారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు డా॥ జానకిరామ్ ముదిరాజ్, డోకూర్ రాము, తిరుపతి, కోట్ల శ్రీను, కోట్ల రామకృష్ణ, సాయిలు, గోకం రాములు, నర్సిములు, గోవిందు, వాకిటి చంద్రమౌళి, నవీన్‌కుమార్, గోకం హన్మంతు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎద్దుల మధుసూదన్‌రెడ్డి, మొగిలన్న, నరేష్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



చెరువులో చేప పిల్లలను వదులుతున్న నాయకులు

## సంస్కృతి సాంప్రదాయాలకు చిహ్నాలు ముగ్గుల పోటీలు

**నారాయణ పేట, నవంబరు 19 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కేంద్రంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని జిల్లా గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో జూనియర్ కళాశాల ఆవరణలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. సంస్కృతి, సాంప్రదాయ చిహ్నాలుగా రంగవల్లికలను చిన్నారుల్లో ప్రోత్సహించి వారిలో దాగి ఉన్న కళలను వెలికి తీసేందుకు ఇలాంటి పోటీలు ఎంతో దోహదపడతాయని గ్రంథాలయ అధికారి శిల్ప తెలిపారు. ఈ పోటీలలో మొత్తం 170 మంది విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. పాల్గొన్న ప్రతి విద్యార్థి సాంప్రదాయ కళల పట్ల ఆసక్తి చూపడం హర్షణీయమని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రామ్మోహన్, రఘు,ఉపాధ్యాయులు ఇతరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం

**నారాయణ పేట, నవంబరు 19 ప్రభాతవార్త :** నారాయణ పేట మండలం అప్పంపల్లి సమీపంలోని మెడికల్ కళాశాల హాస్పిటల్ ఆవరణలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు సరిత హరి నారాయణ్ బట్టడ్ మాట్లాడుతూ పేదల సంక్షేమమే లయన్స్ క్లబ్ ధ్యేయమని ఆమె పేర్కొన్నారు. సమాజ సేవనే లక్ష్యంగా పెట్టుకున్న తమ సంస్థ పేదలకు సహాయం అందించడం ద్వారా సేవా భావాన్ని మరింత బలోపేతం చేస్తుందని చెప్పారు. అన్నదాన కార్యక్రమాలు ఆకలితో బాధపడుతున్న వారికి నిజమైన ఉపశమనాన్ని ఇస్తాయని,ఈ సేవ పుణ్యసార్థకమని అన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పాస్ట్ గవర్నర్ హరి నారాయణ్ బట్టడ్, కార్యదర్శి సాయినాథ్, రవికుమార్ గౌడ్, సదానంద్ చారి, బబిత భట్టడ్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరాగాంధీ సేవలు మరువలేనివి

**కొల్లాపూర్, నవంబర్ 19 ప్రభాతవార్త :** ప్రముఖ కాంగ్రెస్ పార్టీ నాయకురాలు మాజీ ప్రధానమంత్రి భారతరత్న ఇందిరా గాంధీ 108వ జయంతి సందర్భంగా కొల్లాపూర్ పట్టణంలోని శ్రీవాణి విద్యానిలయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అభిమానులు అంతా కలిసి ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిసిసి కార్యనిర్వాహక కార్యదర్శి, ఉమ్మడి జిల్లా ఇందిరాగాంధీ అభిమాన సంఘం అధ్యక్షులు రంగినేని జగదీశ్వరుడు ప్రసంగిస్తూ ఇందిరా గాంధీ చేసిన అమోఘమైన సేవలను కొనియాడారు. ప్రధానమంత్రి హోదాలో అహర్నిశలు ప్రజాసేవలు చేస్తూ చివరి రక్తపు బొట్టు వరకు ప్రాణాలు కోల్పోయిన గొప్ప ధీరవనిత ఇందిరమ్మ అని బడుగు, బలహీన, మైనారిటీ వర్గాలకు అనేక సేవలందించి గొప్ప పరిపాలనదక్షురాలు ఇందిరా గాంధీ అని,ఆమె సేవలను రంగినేని జగదీశ్వరుడు కొనియాడారు. ఈసందర్భంగా మహిళలకు బ్రెడ్స్ ,పండ్లు, చిన్నారి విద్యార్థులకు స్వీట్స్ అందజేశారు.ఈకార్యక్రమంలో రాముయాదవ్, న్యాయవాది మధుసూదన్ రావు, జమీల్ అహ్మద్ ఖాన్, గోవింద్ గౌడ్, వెంకటస్వామి, మోగులోతు రవీందర్, రజక స్వామి, బాలయ్య, జావీద్, కాంగ్రెస్ పార్టీ అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు.

**అమిస్తాపూర్‌లో ఘనంగా**
**ఇందిరాగాంధి జయంతి వేడుకలు**

**భూత్పూర్,నవంబర్ 19,ప్రభాతవార్త :** భారత మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరా గాంధి 108వ జయంతి వేడుకలు బుధవారం భూత్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని అమిస్తాపూర్‌లో మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కెంద్యాల పద్మ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌నాయకులు,కార్య కర్తలు ఘనంగా నిర్వహించారు.ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా కెంద్యాల పద్మ మాట్లాడుతూ దేశప్రధానిగా ఇందిరా గాంధీ దేశంలో గణనీయమైన ప్రగతి పథకాలు ప్రవేశపెట్టి దేశపురోగతికి పాటుపడ్డారని తెలిపారు. ఇరవై సూత్రాల పథకం,గరీబీ హఠావో,బ్యాంకుల జాతీయకరణ,పేదలకు భూపంపిణీ వంటి బృహత్తర పథకాలతో దేశాన్ని ముందుకు నడిపారన్నారు.దేశ, అంతర్జాతీయ స్థాయిలో భారతదేశాన్ని కీర్తిని గడింపజేయడంలో ఇందిరాగాంధీ కీలకపాత్ర పోషించారన్నారు.ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ నాయకులు కెంద్యాల నరేందర్,ఆగిరి రవి,కోరె పవన్,కెంద్యాల రాజేష్,మట్టి ఆనంద్,ఆర్ఎంపి పాష తదితరులు పాల్గొన్నారు.



అమిస్తాపూర్‌లో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతిని జరుపుతున్న కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు

**ఘనంగా ఇందిరాగాంధీ 108వ జయంతి**

**పెబ్బేరు, నవంబరు 19 ప్రభాతవార్త :** స్వర్గీయ మాజీ మహిళా ప్రధాని ఇందిరాగాంధీ 108వ జయంతి సందర్భంగా పెబ్బేరు మండల,పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి స్థానిక సుభాష్ చౌరస్తాలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నాయకులు వారు దేశానికి చేసినటువంటి సేవలను కొనియాడుతూ గరీబి అటావో నినాదంతో బడుగు బలహీన వర్గాలకు ఎన్నో సంస్కారంలోకి తీసుకొచ్చారని బ్యాంకుల జాతీయకరణ, పేదలకు భూ పంపిణీ కార్యక్రమం చేపట్టిన ఉక్కు మహిళగా ఆమెకు ఎంతో కీర్తి ఉందని అన్నారు. కార్యక్రమంలో పెబ్బేరు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఆమె జయంతి సందర్భంగా మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పెబ్బేరు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మర్కెట్ చైర్మన్ విజయవర్ధన్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాసులు గౌడ్, సింగల్ విండో చైర్మన్ కోదండరామిరెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్‌సాగర్, మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్, మాజీ జిల్లా యువజన సంఘం అధ్యక్షుడు రంజిత్ కుమార్, దయాకర్ రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ మోతే రాములు, రామన్ గౌడ్, యుగంధర్ రెడ్డి, భాను ప్రకాష్ రెడ్డి, రాములు, సర్వేష్, షకీల్, శివ, జగదీశ్వర్ రెడ్డి, అసెంబ్లీ జనరల్ సెక్రటరీ శివకుమార్, కాటమోని వెంకటయ్య గౌడ్, మండల కాంగ్రెస్ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న మండల కాంగ్రెస్ నాయకులు

**ఇందిరమ్మ స్ఫూర్తితో నిరుపేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ**

**మక్తల్‌లో ఘనంగా ఇందిరమ్మ జయంతి వేడుకలు**

**మక్తల్ టౌన్, నవంబరు 19 ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వ ఆధ్వర్యంలో 5 ఏళ్ల పదవీ కాలంలో మఖ్తల్ నియోజకవర్గానికి భారీ నిధులు తీసుకువచ్చి, అభివృద్ధి చేస్తామని మంత్రి వాకిటి శ్రీహరి హామీ ఇచ్చారని, ఇందిరమ్మ స్ఫూర్తితో సంక్షేమ ఫలాలను ప్రతి ఇంటికి అందించడమే ధ్యేయంగా పని చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం స్వర్గీయ మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇందిరాగాంధీ ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని, బ్యాంకుల జాతీయాకరణ, 20సూత్రాల పథకం, గరీభీ హటావో, పేదలకు ఇండ్లు లాంటి పథకాలతో పెద ప్రజలకు అండగా నిలిచారని కొనియాడారు. ఇందిరమ్మ స్ఫూర్తితో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి వాకిటి శ్రీహరి నాయకత్వంలో మక్తల్ నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లు, పట్టణానికి దాదాపు 300పైగా ఇండ్లు కేటాయించారని తెలిపారు. బిల్లులు రావని ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, ఇప్పటికే నియోజకవర్గం లో అనేక మంది లబ్ధిదారులు బిల్లులు తీసుకున్నారన్న సంగతి గుర్తు చేశారు. ఇందిరమ్మ ఇల్లు కింద రూ.5 లక్షలు ప్రభుత్వం పూర్తి ఉచితంగా అందిస్తోందని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అధికారుల సమక్షంలో నూతనంగా ఇందిరమ్మ లబ్ధిదారుల ప్రొసీడింగ్స్ మంత్రి కార్యాలయంలో ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గణేష్ కుమార్, పట్టణ అధ్యక్షులు ఏ.రవికుమార్, మాజీ జడ్పిటిసి లక్ష్మారెడ్డి, కట్టా సురేష్ గుప్త, కోళ్ళ వెంకటేష్, గార్లపల్లి అశోక్ గౌడ్ , గుంతలి రవి, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

## మత్స్యకారుల సంక్షేమం అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

**దేవరకద్ర,నవంబరు 19 ప్రభాతవార్త:** దేవరకద్ర మున్సిపాలిటీ చెరువు దగ్గర మత్స్యశాఖ ప్రత్యేక అధికారి ఏడి రాధా రోహిణి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మత్స్యకారులకు 100 శాతం రాయితీతో చేపల విడుదల కార్యక్రమాన్ని దేవరకద్ర మున్సిపాలిటీ పెద్ద చెరువు దగ్గర కాంగ్రెస్ నాయకులతో కలిసి లక్ష ఇరవే వేల చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధి, ఉపాధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. చేప పిల్లల పంపిణీ పారదర్శకంగా ఉండేలా చెరువుల వద్ద సైన్ బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు. మత్స్య సంపద మరింత అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకుంటామన్నారు. మత్స్యకారులు ఆర్థికంగా బలోపేతం కావడానికి ప్రజా ప్రభుత్వం 100 శాతం రాయితీతో ఈ చేప పిల్లలను అందిస్తుందని వారు తెలిపారు. అన్ని వర్గాల పేద ప్రజలు వారి వారి రంగాల్లో ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ చైర్మన్ గోనెల శ్రీనివాసులు, మత్స్యశాఖ మండల అధ్యక్షులు వెంకట్ రాములు, దేవరకద్ర ఎస్సై బి.నాగన్న, ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసిల్దార్ దీపికా రెడ్డి, మత్స్యకారుల సభ్యులు, పట్టణ అధ్యక్షులు ఫారుక్ అలీ, వర్మ ముదిరాజ్, గోవర్ధన్ రెడ్డి, వీరప్పయ్య చైర్మన్ నరసింహారెడ్డి, అంజన్ కుమార్ రెడ్డి, ఉమ్మి గారి వెంకటేష్, చంద్రమౌళి, గద్దెగూడెం పూర్ణిత, బస్వాయిపల్లి విక్రం రెడ్డి, శివకుమార్, ఫక్రుద్దీన్, వివిధ గ్రామాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



చేప పిల్లలు వదులుతున్న మత్స్యశాఖ ఏడి రాధా రోహిణి

## జాతీయస్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికైన కేజీబీవీ విద్యార్థిని

**ధన్వాడ, నవంబరు 19 ప్రభాతవార్త :** ధన్వాడ కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థిని నాగలక్ష్మి జాతీయస్థాయి సీనియర్ రెజ్లింగ్ పోటీలకు ఎంపిక కావడంతో మండలం మొత్తంలో ఆనందం వ్యక్తమవుతోంది. క్రీడా రంగంలో గ్రామీణ బాలికలు కూడా సత్తా చాటగలరని మరోసారి నిరూపించిందని పాఠశాల సిబ్బంది పేర్కొన్నారు. బుధవారం ఆమెను సందర్శించిన జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు,మాజీ ఎంపీటీసీ సుంకు ఉమేష్ కుమార్ నాగలక్ష్మిని శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ పాఠశాలల్లో చదువుతున్న పిల్లలు కూడా ఎంతో ప్రతిభ కలిగి ఉన్నారు. నాగలక్ష్మి రెజ్లింగ్‌లో జాతీయస్థాయికి చేరడం ధన్వాడ మండలానికి గర్వకారణం. రాబోయే పోటీల్లో మెరిసి రాష్ట్రానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలి" అని తెలిపారు. పాఠశాల సిబ్బంది మాట్లాడుతూ నాగలక్ష్మి క్రమశిక్షణ, కృషి, కోచ్ మార్గదర్శకత ఫలితంగా ఈ విజయం సాధించింది. గురుకులం నుంచి జాతీయస్థాయికి చేరడం అరుదైన విషయం" అని అన్నారు. తనకిచ్చిన ప్రోత్సాహానికి ధన్యవాదాలు తెలిపిన నాగలక్ష్మి జాతీయస్థాయిలో మెడల్ సాధించడం నా లక్ష్యం. అందరి ఆశల్ని నిలబెట్టుకునేందుకు మరింత శ్రమిస్తాను" అని తెలిపింది. కార్యక్రమంలో శ్రీనివాస్‌తో పాటు గురుకుల బోధకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



రెజ్లింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థిని నాగలక్ష్మిని సన్మానిస్తున్న దృశ్యం

## వయోవృద్ధుల అనుభవం వెలకట్టలేనిది

**పెద్దల జీవిత అనుభవాలు ప్రతి ఒక్కరికి అవసరం**

**గద్వాల టౌన్, నవంబర్ 19, ప్రభాతవార్త:** వయోవృద్ధులు తమ జీవిత అనుభవంతో పిల్లలకు మంచి విషయాలు చెబుతుంటారని, వారి అనుభవాలు వెలకట్టలేమని, వారి అనుభవ మాటలను పాటిస్తే ప్రతి ఒక్కరూ ఎదిగేందుకు అవకాశం ఉంటుందని అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. దివ్యాంగులు, వయోవృద్ధుల, ట్రాన్స్ జెండర్ వ్యక్తుల సాధికారత శాఖ ఆధ్వర్యంలో, సీనియర్ సిటిజన్ ఫోరం సహకారంతో బుధవారం గద్వాల ఐడిఓసి సమావేశ మందిరం లో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం ఘనంగా నిర్వహించా రు. ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మన దేశంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ క్రమంగా తగ్గుతోందని, ఈ పరిస్థితులకు కారణాలేంటో అధ్యయనం చేసి పరిష్కరించవలసిన అవసరం ఉందన్నారు. వయోవృద్ధుల సంక్షేమానికి ప్రవేశపెట్టిన అనేక చట్టాలు ఉన్నప్పటికీ ఏ తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను ఇబ్బంది పెట్టాలని చూడరన్నారు. యువత భవిష్యత్తులో వృద్ధులు కాక తప్పదని తెలుసుకుంటే వారి తల్లిదండ్రులను తాము ఇప్పుడు బాగా చూసుకుంటేనే తమ పిల్లలు కూడా తమ బాగోగులు చూస్తారని తెలుసుకోవాలన్నారు. అనంతరం వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి ముఖ్య అతిధులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి శంకర్, ఆర్డిఓ అలివేలు, జిల్లా సంక్షేమ అధికారిని సునంద, సీనియర్ సిటిజన్స్ ఫోరం జిల్లా అధ్యక్షులు మోహన్ రావు, ఇండియన్ రెడ్ క్రాస్ సంఘం జిల్లా చైర్మన్ అయ్యపురెడ్డి, బ్రహ్మకుమారిస్ గద్వాల ప్రతినిధి మంజుల, తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ

## పొలాల దగ్గరే వడ్లను కొనుగోలు చేయాలని రైతుల డిమాండ్

**ధన్వాడ, నవంబరు 19 ప్రభాతవార్త :** ధన్వాడ మండలం గోటూర్ గ్రామంలో బుధవారం రైతులు అధికారులను నిలదీసి తమ సమస్యలను వెల్లడించారు. వడ్లు ఆరబెట్టుకునేందుకు తగిన స్థలాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, గతంలో జరిగినట్లే ఈసారి కూడా అధికారులు నేరుగా పొలాల దగ్గరకు వచ్చి వడ్లను కొనుగోలు చేసే విధానాన్ని అమలు చేయాలని రైతులు కోరారు. రైతులు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలకు వడ్లు తరలించడం ప్రస్తుతం చాలా భారంగా మారింది. రవాణా ఖర్చులు పెరిగాయి. వర్షాలు పడే అవకాశం ఉండటంతో వడ్లను దూరం తీసుకెళ్లడం ఇబ్బందికరమని అని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామానికి వచ్చిన అధికారులను చుట్టుముట్టిన రైతులు, తమ వడ్లు పొలాల్లోనే పేరుకుపోయి ఉన్నాయని, ప్రభుత్వం గతంలో ప్రవేశపెట్టినట్టుగా డోర్ టు ఫీల్డ్ కొనుగోలు విధానం మళ్లీ ప్రారంభిస్తే రైతులకు పెద్ద ఊరట కలుగుతుందని తెలిపారు. అధికారులు రైతుల సమస్యలను వినిపించుకుని పైస్థాయికి నివేదిస్తామని తెలిపారు.



అధికారులను చుట్టుముట్టిన రైతులు



నగదును అందిస్తున్న పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్

## అయ్యప్ప దీక్షాస్వాముల
## అన్నదానానికి విరాళం

**భూత్పూర్,నవంబర్ 19,ప్రభాతవార్త :** భూత్పూర్ అయ్యప్ప దీక్షాస్వాముల నిత్యాన్నదానానికి తన వంతు సహకారంగా భూత్పూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్ రు.25వేల నగదును బుధవారం భూత్పూర్ పట్టణ కేంద్రంలోని మునిరంగస్వామి దేవాలయంలో ఉంటున్న అయ్యప్ప దీక్షాస్వాములకు ఈ నగదును నవీన్‌గౌడ్ అందించారు.ఈ సందర్భంగా లిక్కి నవీన్‌గౌడ్ మాట్లాడుతూ అయ్యప్ప దీక్షా స్వాములకు సాయం చేస్తే అయ్యప్పస్వామికి సేవ చేసినట్లని పేర్కొన్నారు.దీక్షలన్నింటిలో అయ్యప్పదీక్ష చాలా కఠోరమైందని పేర్కొన్నారు.

## జిల్లా టెన్నికాయిడ్
## క్రీడలలో ప్రతిభ చాటిన విద్యార్థులు



ప్రతిభ చాటిన విద్యార్థినీ, విద్యార్థులు

**మక్తల్ టౌన్, నవంబరు 19 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర టెన్నికాయిట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వెంకటేష్, కోశాధికారి రాజ్ కుమార్, ఉపాధ్యక్షుడు బి.గోపాలం ఆదేశాల మేరకు నారాయణపేట జిల్లా టెన్నికాయిట్( రింగ్ బాల్) అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 19న మక్తల్ శ్రీ సత్యసాయి మందిరంలో బాలబాలికలకు జిల్లా స్థాయి టెన్నికాయిట్ ఎంపికలను నిర్వహించి క్రీడా ప్రతిభను చాటి రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపిక చేసినట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.దీప తెలిపారు. నారాయణపేట జిల్లాలోని బాల బాలికలు వందమంది ఈ పోటీలలో పాల్గొన్నారు అని ఆమె తెలిపారు. ఈ ఎంపికలను టెనికైట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.గోపాలం ప్రారంభించారు. రాష్ట్రస్థాయి టెలికాయిట్ పోటీలకు ఎంపికైన బాల బాలికల విభాగంలో సమత (కృష్ణవేణి) చైత్ర, అశ్విని, ఫైజా, అనూష, వైష్ణవి, మంజుల, మాళవిక, (కేరళ స్కూల్) బిందు (ధన్వాడ). విశాల్, కార్తీక్ ,హరికృష్ణ ప్రసాద్, గౌతమ్, అజయ్, గురుచరణ్, ఎం. కార్తిక్, శ్రీకాంత్, రామ్ చరణ్, రమేష్, వీరందరూ ఈ నెల 20 నుండి 21 వరకు హనుమకొండలో జరుగు రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలలో పాల్గొనుటకు, ఈ నెల 19న తరలి వెళ్లినట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.దీప తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్య సాయి సేవ సమితి నిర్వాహకులు బి.భాస్కర్ శుభోదయ, రాములు, పీఈటీలు దామోదర్, వెంకటేష్, రాధమ్మ పాల్గొన్నారు.

## ఇసుక తరలిస్తున్న టిప్పర్ పట్టివేత: ఎస్సై

**దామరగిద్ద, నవంబరు 19 ప్రభాతవార్త :** దామరగిద్ద పోలీస్ స్టేషన్ పరిధిలో ఏలాంటి పర్మిషన్ లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ యజమాని, డ్రైవర్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ అరుణ్ తెలిపారు. టిప్పర్ డ్రైవర్ సవారి అశోక్, రాములు, షేర్నపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి షేర్నపల్లి నుండి మొగల్మడకకు అక్రమంగా ఇసుక తరలిస్తుంటే లోకుర్తి వద్ద దామరగిద్ద పోలీసులు పట్టుకొని పోలీస్ స్టేషన్‌కి తరలించి డ్రైవర్ సవారి అశోక్, ఓనర్ ఎం.శివకుమార్ గౌడ్, జాజాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తులపై కేసు నమోదు చేయడం జరిగిందని ఏఎస్ఐ తెలిపారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అధికారులు పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టాలి

**కల్వకుర్తి, నవంబర్ 19 ప్రభాతవార్త:** ఇందిరమ్మ రాజ్యంలో గూడు లేక ఇబ్బందులు పడవద్దనే సదుద్దేశ్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు పక్కా ఇందిరమ్మ గృహాలు నిర్మించి ఇచ్చి వారి జీవితాల్లో వెలుగులు నింపుతుందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రెవెన్యూ డివిజన్ పరిధిలోని అన్ని మండలాల ఎంపిడిఓలు, మున్సిపల్ కమిషనర్, గృహ నిర్మాణ శాఖ డిఈలు, ఏఈ లతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల విషయం పై ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లోని గ్రామాలలో, కల్వకుర్తి మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో ఇందిరమ్మ ఇండ్ల పురోగతిపై అధికారుల నుండి వివరాలు తెలుసుకున్నారు. బేస్మెంట్ స్థాయిలో ఎన్ని,లెంటల్, స్లాబ్ లెవెల్ అయిన లబ్ధిదారులకు బిల్లులు సకాలంలో వారి ఖాతాలో జమ అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని, ఇంకా పనులు ప్రారంభం కాని వాటిని త్వరగా పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్లకు ప్రభుత్వం బడ్జెట్ విడుదల చేసిందని పనులు పూర్తి స్థాయిలో చేసుకోని బిల్లులు అందే విధంగా అధికారులు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు.ఇందిరమ్మ ఇళ్ల విషయంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.ఈ సమావేశంలో అన్ని మండలాల ఎంపిడిఓలు, కమిషనర్, గృహ నిర్మాణ శాఖ డిఈలు ఎఈలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

## మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలి

- యువత గంజాయి, డ్రగ్స్ బారిన పడకుండా చూడాలి - కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**కల్వకుర్తి, నవంబర్ 19 ప్రభాతవార్త:** మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని, మహిళల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. మహిళల పేరిట పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశంగా అడుగులు వేస్తున్నారని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కల్వకుర్తి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం కల్వకుర్తి, చారకొండ మండలాలకు చెందిన కళ్యాణ లక్ష్మి … 67మంది లబ్ధి దారులకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న ఉచిత బస్సు ప్రయాణం,ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, రుణమాఫీ,రైతు ప్రోత్సాహం,రేషన్ కార్డులు, సన్న బియ్యం ఇలాఎన్నో రకాలుగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ప్రభుత్వానికి అండగా నిలిచి త్వరలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకోవాలని ఆయన కోరారు. గత ప్రభుత్వం 10సంవత్సరాల ఇండ్ల, రేషన్ కార్డులు ఇచ్చిన పాపాన పోలేదని దుయ్యబట్టారు. కల్వకుర్తి పట్టణంలో 150 పడకల ఆసుపత్రి పనులు ప్రారంభమయ్యాని, త్వరలోనే ప్రజలకు మరింత నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తాన


లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

న్నారు. ముఖ్యంగా యువత గంజాయి, డ్రగ్స్ అలవాటు పడుతున్నారు వారి పట్ల తల్లి తండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పోలీసులు డ్రగ్స్,గంజాయి, మద్య సేవించి వాహనాలు నడుపుతున్న వారిని కఠినంగా శిక్షించాలని, జైలులో పెట్టాలని పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో జనార్దన్ రెడ్డి, తహశీల్దార్ ఇబ్రహీం,చారకొండ రెవెన్యూ అధికారి భరత్ గౌడ్, మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, మార్కెట్ కమిటి చైర్మన్ సంజీవ్ యాదవ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కాయితీ విజయ్ కుమార్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు చిమ్ముల శ్రీకాంత్ రెడ్డి, డైరెక్టర్ రమాకాంత్ రెడ్డి, జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు రాములు, నాయకులు దామోదర్ గౌడ్,విజయభాస్కర్, జంగయ్యగౌడ్,వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సిరి ఫౌండేషన్ వారి సహకారంతో విద్యార్థులకు చేయూత

**దేవరకద్ర, నవంబరు 19 ప్రభాతవార్త:** సిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల దేవరకద్రలో చదివే ప్రథమ, ద్వితీయ ,సంవత్సరం విద్యార్థులకు పరీక్ష రుసుం చెల్లించేందుకు సిరి ఫౌండేషన్ ముందుకొచ్చారు. విద్యార్థులకు సిరి ఫౌండేషన్ పరీక్ష రుసుము చెల్లించి వారికి ఎంతో ప్రోత్సాహాన్ని అందించారు. సిరి ఫౌండేషన్ పరీక్ష రుసుం చెల్లించిన విద్యార్థులు జి నందిని, పి.అరవింద్, జి.ఈశ్వర ప్రసాద్, హెచ్.రామ్ చరణ్,ఎం.వేణు కుమార్, శ్రీనిజ తదితరులు. అదేవిధంగా గత సంవత్సరం నుండి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఊర్మిళాదేవి, వారి ఉపాధ్యాయ బృందం కలిసి వారి కళాశాలలో చదువుతున్న టాపర్స్ విద్యార్థులకు, బీద విద్యార్థులకు ప్రతి సంవత్సరం పరీక్ష రుసుము చెల్లిస్తున్నారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు సిరి ఫౌండేషన్ దాతలకు, కళాశాల ప్రిన్సిపాల్ ఊర్మిళ దేవి మరియు ఉపాధ్యాయ బృందానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిరి ఫౌండేషన్ దాతలు విజయ్, నందు, రాఘవేంద్ర, ప్రవీణ్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల ఆరోగ్యం కోసం లయన్స్ క్లబ్ సహకారం

**కల్వకుర్తి, నవంబర్ 19 ప్రభాతవార్త:** సమాజంలోని అన్ని వర్గాల ప్రజల ఆరోగ్యానికి లయన్స్ ఇంటర్నేషనల్ అధిక ప్రాధాన్యమిస్తుందని, అందులో భాగంగా బుధవారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో లయన్స్ క్లబ్ కల్వకుర్తి, లయన్స్ క్లబ్ ఆమనగల్లు, రామ్‌రెడ్డి కంటి ఆసుపత్రి, జిల్లా అందత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కంటి చికిత్స శిబిరం నిర్వహించారు. శిబిరానికి 114 మంది వివిధ గ్రామాల నుండి హాజరు కాగా అందులో 15 మందికి ఆపరేషన్ అవసరమని కంటి వైద్య సహాయకులుభావండ్ల వెంకటేష్,వీరమల్ల వెంకటస్వామిలు గుర్తించారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించే వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ క్లబ్ కల్వకుర్తి అధ్యక్షుడు చిగుళ్ల పల్లి శ్రీధర్ పేర్కొన్నారు.రాబోయే రోజుల్లో మరిన్ని ఆరోగ్య శిబిరాలు నిర్వహించి ప్రజల ఆరోగ్య పరిరక్షణకుతమ వంతు సహకారం చేస్తామన్నారు. లయన్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఇప్పటివరకుఎన్నో వైద్య శిబిరాలు నిర్వహించినట్లు ఆయనతెలిపారు. ఈ కార్య క్రమంలో లయన్స్ క్లబ్ కల్వకుర్తి కార్యదర్శి కలిమిచెర్ల గోపాల్, మెంబర్షిప్ కమిటీ చైర్మన్ గుబ్బ కిషన్, ప్రచార కార్యదర్శి దార మోని గణేష్, మేకల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

## దాత సహకారంతో కోనేరు చుట్టూ కంచే ఏర్పాటు

**వెల్దండ, నవంబర్ 19 ప్రభాతవార్త:** దక్షిణ కాశీగా విరజిల్లుతున్న గుండాల అంబరామలింగేశ్వర స్వామి దేవాలయం కోనేరు చుట్టూ భద్రత కోసం ఇనుపకంచే ఏర్పాటుకు మండలంలోని చెదు రుపల్లి గ్రామానికి చెందిన పరిమళ పరమేశ్వర్‌రెడ్డి తన సొంతంగా రూ.2లక్షల నిధులతో ఏర్పాటు చేశారు. ఈ సంవత్సరం శివరాత్రి బ్రహ్మోత్సవాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థి కోనేరులో పడి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. జాగ్రత్తలలో భాగంగా అప్పటినుండి భక్తులను కోనేరు పరిసరాలలోకి భక్తులను వెళ్లనివ్వలేదు. ఎంతో ప్రసిద్ధి చెందిన కోనేరు చుట్టూ భక్తుల భద్రతకై ఇనుప కంచె ఏర్పాటు చేయడం జరిగిందని,ఇదివరకు పెద్ద రథోత్సవ మరమ్మత్తుకు ఒక లక్ష రూపాయలు విరాళం అందించడం జరిగిందని పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా పరమేశ్వర్‌రెడ్డి దంపతులను ఆలయ అర్చకులు శాలువాలతో సన్మానించి స్వామివారి తీర్థ ప్రసాదాన్ని అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ తాలూకా కిసాన్‌సెల్ అధ్యక్షులు పర్వత్‌రెడ్డి, దేవాలయ వైస్ చైర్మన్ అరుణ్ నాయక్‌తో పాటు దేవాలయ అర్చకులు ఉన్నారు.


కోనేరు చుట్టు ఏర్పాటు చేసిన కంచె

## ఘనంగా స్త్రీ శక్తి దివాస్

**ఊట్కూర్,నవంబరు19 ప్రభాతవార్త :** ఊట్కూర్ మండల కేంద్రంలోని శ్రీ సర్వతి శిశుమందిర్ పాఠశాల ఆధ్వర్యంలో గ్రామంలో స్త్రీ శక్తి దివస్ వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. సుమారు వందమంది చిన్నారి బాలికలు ఝాన్సీ లక్ష్మీబాయి వేషధారణలో గ్రామ పురవీధుల గుండా ర్యాలీగా వెళ్లి అందరినీ ఆకట్టుకున్నారు. తరువాత పాఠశాలలో ఏర్పాటు చేసిన సప్త శక్తి సంగం కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు గ్రామానికి చెందిన వందకు పైగా మహిళలు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జోగిని వ్యతిరేక పోరాట సమితి నాయకురాలు హాజమ్మ మాట్లాడుతూ మహిళల పై జరుగుతున్న అకృత్యాలను నిలువరించేందుకు ప్రతి మహిళ కూడా ఝాన్సీ, రుద్రమదేవి, జీజియా మాతల వంటి వీరనారులను ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు.ఉమ్మడి కుటుంబ వ్యవస్థ తగ్గిపోవడం వల్లే నేటి సమస్యలు పెరిగాయని, కుటుంబ బంధాలను కాపాడుకోవాలని సూచించారు. ముఖ్య వక్తలుగా పాల్గొన్న రాజశ్రీ, హరిలత మాట్లాడుతూ కుటుంబ జీవితంలో మహిళ పాత్రఅత్యంత కీలకమని, విలువలు-సంస్కారాలను బాల్యంలోనే అందించాల్సినబాధ్యత తల్లిదండ్రులదేనని పేర్కొన్నారు. సంస్కారంతో కూడిన విద్య ను అందించడంలో శిశుమందిరాలు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయని అభిప్రాయపడ్డారు. స్వభాష, స్వదేశీ భావనలను పెంపొందించుకోవాలని మహిళలకు సూచించారు.చిన్నారుల ఝాన్సీ వేశధారణ ప్రదర్శనలు సందర్శకులను ఎంతగానో ఆకర్షించాయి.కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షులు ఎం.భాస్కర్,ఏ.రాములు, వెంకటనారాయణ, భీంరాజ్, రఘువీర్, శంకర్ గౌడ్, ప్రధానాచార్యులు విశాల్, రోషనప్ప, దేవిశ్రీ, కిషోర్, నర్సింహ, సాయి తదితరులు పాల్గొన్నారు.


స్త్రీ శక్తి దివస్ వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

## రైతులను ఆదుకోవాలి

**మద్దురు, నవంబరు 19 ప్రభాతవార్త:** ఉమ్మడి మద్దూరు కొత్తపల్లి మండలం గొర్లోని బాయ్ గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన వద్ద కొనుగోలు కేంద్రాల్లో గని బ్యాగులు అందుబాటులో లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పంట పొలాల నుంచి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించేందుకు అదనపు ట్రాన్స్‌పోర్టు ఖర్చులు రైతులపై భారంగా మారుతున్నాయని చెప్పారు. ఒక్క ట్రిప్పుకు సుమారు అదనపు ఖర్చు అవుతుందని, గని బ్యాగులు నేరుగా పంట పొలాలకే పంపిణీ చేస్తే రైతులకు సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వం ప్రకటించిన క్వింటాల్‌కి రూ. 500 బోనస్ అందకపోవడం రైతుల్లో ఆందోళనకు దారితీస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు. గన్ని బ్యాగులు, బోనస్ విషయాలను ప్రభుత్వం త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు, బిఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి

## వయోవృద్ధుల పట్ల ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ చూపాలి

### కుటుంబానికి అమూల్యమైనది వయోవృద్ధుల అనుభవం : ఆర్డీవో రామచంద్రనాయక్

**నారాయణ పేట, నవంబరు19 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా కేంద్రంలో వయోవృద్ధుల పట్ల ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ చూపాలని, వారు తమ శేష జీవితాన్ని ఆనందంగా గడపేందుకు సమాజం మొత్తం బాధ్యతగా వ్యవహరించాలని నారాయణపేట ఆర్డీవో రామచంద్రనాయక్ అన్నారు. మహిళా, శిశు దివ్యాంగుల వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బుధవారం ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన అంతర్జాతీయ వయోవృద్ధుల వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వయోవృద్ధుల అనుభవం కుటుంబానికి అమూల్యమైనదని, ముసలివాళ్లకు ఏం తెలుసు అనే భావన తప్పని చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లల కోసం త్యాగం చేస్తారని, వారి వృద్ధాప్యంలో ప్రేమ, గౌరవం ఇవ్వడం సంతాన ధర్మమని గుర్తు చేశారు.ఇటీవలి కాలంలో ఆస్తి కోసం తల్లిదండ్రులపై దాడులు వంటి ఘటనలు పత్రికల్లో కనిపించడం బాధకరమని ఆవేదన వ్యక్తం చేశారు వయోవృద్ధులకు హక్కులు ఉన్నాయని,వాటిని రక్షించేందుకు సిటిజన్‌యాక్ట్ సహాయపడుతుందని తెలిపారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఆర్డీవో రామచంద్రనాయక్


హాజరైన వృద్ధులు

వృద్ధులను పట్టించుకోని వారి కుటుంబ సభ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకునే అధికారం ఆర్డీవో కార్యాలయానికి ఉందని పేర్కొన్నారు. డిప్యూటీ కలెక్టర్ ఫణి కుమార్ వయోవృద్ధులు ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు తగిన వ్యాయామం, నడక అలవాటు చేసుకోవాలని సూచించారు. ఎలాంటి సమస్య ఉన్నా ఎల్డర్ లైన్ 14567 టోల్ ఫ్రీ నెంబరుకు ఫోన్ చేసి సహాయం పొందవచ్చని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మాట్లాడిన సీనియర్ సిటిజన్స్ ప్రతినిధులు వయోవృద్ధుల సంక్షేమ భవనం నిర్మాణానికి ప్రభుత్వ స్థలం కేటాయించాలని కోరారు. అనంతరం నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమం ముగిసిన తర్వాత వయోవృద్ధులకు భోజన వసతి కూడా కల్పించారు. ఈ కార్యక్రమంలో డా. శైలజ, డీపీఆర్వో రషీద్, డా. మల్లికార్జున్, డిడబ్ల్యూఓ సిబ్బంది, డిసిపివో కరిష్మా, చైల్డ్ లైన్ సిబ్బంది,సఖి సిబ్బంది, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రైతును రాజు చేయడమే ముఖ్యమంత్రి లక్ష్యం

■ అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ

**ఉప్పునుంతల, నవంబరు 19 ప్రభాతవార్త :** రైతును రాజుగా చేయడమే ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి లక్ష్యమని టి పిసిసి ఉపాధ్యక్షుడు, నాగర్‌కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. మండల కేంద్రమైన ఉప్పునుంతలలో తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ వారి సారథ్యంలో ఉప్పునుంతల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. ఉప్పునుంతల, కొరటికల్, మొల్గర, లక్ష్మాపూర్ గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడ లేని విధంగా రైతులు పండించిన పంటకు మద్దతు ధర కల్పిస్తూ బోనస్ డబ్బులు రైతుల ఖాతాలో జమ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్దనే వరి ధాన్యంఅమ్ముకోవాలని రైతులకు సూచించారు.కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా రైతు ప్రభుత్వం అని రైతు పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని రైతులు పండించిన సన్న వడ్లకు బోనస్ ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టి పిసిసి ఉపాధ్యక్షుడు, నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ, జిల్లా సహకార అధికారి రఘునాథరావు, సూపరింటెండెంట్ మధు, అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ అంతటి రజిత మల్లేష్, డిసిసిబి డైరెక్టర్, సింగిల్ విండో చైర్మన్ సత్తు భూపాల్‌రావు, మండల వ్యవసాయ శాఖ అధికారి కొర్ర రమేష్, మామిళ్ళపల్లి ఆలయ కమిటీ చైర్మన్ వేముల నరసింహారావు, సంఘ సీఈఓ కొత్త రవీందర్ రావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి, మాజీ ఎంపీపీ తిప్పర్తి అరుణ నరసింహారెడ్డి, మాజీ జడ్పీటీసీ అనంత ప్రతాప్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, సీనియర్ న్యాయవాది, కంసానిపల్లి మాజీ సర్పంచ్ కర్నే లక్ష్మీనారాయణ, వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ కృష్ణ, డైరెక్టర్లు సూరం నారాయణరెడ్డి, ఆలూరి శ్రీనివాసులు, మాజీ వైస్ ఎంపీపీ కాలువ గోవర్ధన్‌రెడ్డి, నాయకులు తిప్పర్తి జగన్మోహన్ రెడ్డి, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మేడమోని భాస్కర్, బీసీ సెల్ అధ్యక్షులు మట్టి తిరుపతయ్య గౌడ్, అంతటి శేఖర్ గౌడ్, వెంకటయ్య,సురేష్, పాత్కుల రామచంద్రయ్య, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఉప్పునుంతలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

## జర్నలిస్టుల సంక్షేమానికి నిరంతర పోరాటాలు

■ టీయూడబ్ల్యూజే నేత విరాహత్ అలీ

■ యూనియన్‌లో చేరిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఉర్దూ జర్నలిస్టులు

**మహబూబ్‌నగర్, నవంబరు 19 ప్రభాతవార్త :** నాడు ఉమ్మడి రాష్ట్రంలో, నేడు తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టుల సంక్షేమం కోసం లెక్కలేనన్ని పోరాటాలు చేసిన ఘనత కేవలం తమ సంఘానికి మాత్రమే దక్కిందని, 70 ఏళ్ళ సుధీర్ఘ చరిత్ర కలిగి ఉన్న తమ సంఘం ఏ పార్టీకీ కానీ, ఏ ప్రభుత్వానికి గానీ అనుబంధంగా పనిచేయలేదని, ప్రొఫెషనల్ ట్రేడ్ యూనియనిజం తమ సంఘం ఏకైక లక్ష్యమని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే)రాష్ట్ర అధ్యక్షులు కే.విరాహత్ అలీ స్పష్టం చేసారు. టీయూడబ్ల్యూజే సంఘ కార్యకలాపాలకు ఆకర్షితులై బుధవారం నాడు బషీర్ బాగ్ లోని యూనియన్ కార్యాలయంలో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన ఉర్దూ జర్నలిస్టులందరూ ఆయా సంఘాలకు స్వస్తి పలికి విరాహత్ అలీ సమక్షంలో టీయుడబ్ల్యూజే సభ్యత్వం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జర్నలిస్టులకు ఎలాంటి ఆపదవచ్చినా,వారికి చేదోడుగా నిలబడి ఆదుకునే చిత్త శుద్ధి తమ సంఘానికి మాత్రమే ఉందని, అందుకే రాష్ట్రంలో వేలాది కలం కార్మికుల ఆదరాభిమానాలతో తమ సంఘం దేశంలో రోల్ మోడల్‌గా నిలబడడం తమకు ఎంతో గర్వంగా ఉందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో జర్నలిస్టులు పొందుతున్న సౌకర్యాలన్నీ తమ సంఘం పోరాట ఫలితమేనన్నారు. రాష్ట్రంలో జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసే ఆయా కమిటీల్లో ఉర్దూ జర్నలిస్టులకు ప్రాతినిధ్యం కల్పించేందుకు తాము కృషి చేస్తామని ఆయన భరోసా ఇచ్చారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని ఆయన విచారం వ్యక్తం చేసారు.ప్రస్తుత ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమం కోసం అసెంబ్లి ఎన్నికల మేనిఫెస్టోలో ఎన్నో పథకాలను చేర్చడంతో, జర్నలిస్టుల్లో ఆశలు చిగురించాయని అయితే అధికారాన్ని చేపట్టి రెండేళ్లు గడుస్తున్నా నేటికి ఏ ఒక్క సమస్యను కూడా పరిష్కరించకపోవడంతో జర్నలిస్టుల్లో నిరాశ తప్పడం లేదన్నారు. కనీసం అక్రెడిటేషన్లు, హెల్త్ కార్డులు జారీ చేయడంలో జాప్యం చేయడం సమంజసంకాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జి.మధు గౌడ్, కోశాధికారి మోతె వెంకట్‌రెడ్డి, యూనియన్ మహబూబ్‌నగర్ జిల్లా సీనియర్ నాయకులు విజయరాజు,నాయకులు సతీష్‌రెడ్డి, నాగరాజుగౌడ్, శ్రీనివాస్ గౌడ్, విజయ్, రవీందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


యూనియన్‌లో చేరిన ఉర్దూ జర్నలిస్టులతో విరాహత్ అలీ, మధు గౌడ్, జిల్లా నాయకులు

## అయ్యప్ప మాలధారణతో భక్తి మార్గం వైపు అడుగులు

**ఊట్కూర్, నవంబరు19 ప్రభాతవార్త:** కార్తీక మాసం సందర్భంగా బుధవారం మండలంలోని పెద్దపొర్ల గ్రామ ఆంజనేయ స్వామి దేవాలయంలో భక్తి వాతావరణం నెలకొంది. గ్రామంలో మొదటి అయ్యప్ప మాలధారణ కార్యక్రమం భక్తిశ్రద్ధల నడుమ విశేషంగా నిర్వహించారు.ఈ సందర్భంలో 36పాదాల గురుస్వామి మాట్లాడుతూ మనిషిగా పుట్టిన ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో నడవాలి. అయ్యప్ప మాలధారణ ద్వారా భక్తిని చాటుకోవడం మాత్రమే కాదు, మనలోని మానవత్వాన్ని పెంపొందించుకోవాలి," అని ఆయన పేర్కొన్నారు. దేశం కోసం, ధర్మం కోసం తమ వంతు కృషి చేయాలని కూడా భక్తులకు పిలుపునిచ్చారు.కార్యక్రమంలో మొత్తం31 మందిఅయ్యప్ప భక్తులకు మాలధారణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు నరసింహులు, భానుచందర్, కథలప్ప, నడిపన్న వెంకప్ప తదితరులు పాల్గొన్నారు.

## వనపర్తి మాస్టర్ ప్లాన్ రూపకల్పన

(మొదటి పేజీ తరువాయి)

అవసరమైన సమాచారం వివిధ శాఖలు 15 రోజుల్లో అందించాలన్నారు. పట్టణ ప్రస్తుత పరిస్థితులను అర్థం చేసుకొని, రాబోయే 20 ఏళ్ల వరకు భవిష్యత్ అవసరాలు అంచనా వేయడానికి ప్రాదేశిక వివరాలను సేకరించాలని తెలిపారు. సమగ్ర ప్రణాళిక ద్వారా భవిష్యత్ అభివృద్ధికి భూ వినియోగం, భవన నిర్మాణం, రవాణా, వివిధ రంగాల అభివృద్ధికి తోడ్పడతాయని తెలిపారు. జనాభా ప్రాతిపదికన ప్రజలకు అవసరమైన ఇండ్లు,త్రాగునీరు, రహదారులు,ఇతర సదుపాయాలు ప్రణాళికాబద్ధంగా అందించాలన్నారు. డిటిసిపి అదనపు సంచాలకులు మాట్లాడుతూ అమృత్ 2.0 పథకం కింద 50 వేల నుంచి 90 వేల జనాభా కలిగి ఉన్న వనపర్తి మున్సిపాలిటీ మాస్టర్ ప్లాన్ అమలు కోసం గత ఏడాది నవంబర్లో డ్రోన్‌ఫ్లైతో పాటు, సోషియో ఎకనామిక్ సర్వే చేపట్టడం జరిగిందని చెప్పారు. మున్సిపాలిటీలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా వారి అవసరాలకు బట్టి మాస్టర్ ప్లాన్ అమలు చేయడం ముఖ్యమని తెలిపారు. మాస్టర్ ప్లాన్ రూపకల్పన కోసం సంబంధిత శాఖల అధికారులు 15 రోజుల్లోగా వనపర్తి మున్సిపల్ కమిషనర్‌కు నిర్దేశించిన ఫార్మాట్‌లో సమాచారాన్ని అందజేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ స్థానికసంస్థలు యాదయ్యతో పాటు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఇతర అధికారులు, లైసెన్స్ టౌన్ ప్లానర్లు పాల్గొన్నారు.

## భూభారతి కింద దరఖాస్తు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించాలి

(మొదటి పేజీ తరువాయి)

లేని అభ్యర్థుల సమస్యలను సమగ్రంగా పరిశీలించి పరిష్కరించాలని స్పష్టం చేశారు.ప్రతి దరఖాస్తు పూర్వ రికార్డ్స్, సర్వే డాక్యుమెంట్లు, ఫీల్డ్ సర్వే ఆధారంగా తేల్చి,పారదర్శకంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.భూభారతి కింద ఈ ప్రక్రియల్లో న్యాయపరమైన విధానం,పారదర్శకత, సమగ్రత కలిగి ఉండేలా చూసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మంజుల,రెవెన్యూ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి

**వడ్డేపల్లి, నవంబరు19 ప్రభాతవార్త :** వడ్డేపల్లి మండలం జూలేకల్ గ్రామంలో బుధవారం ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఝాన్సీ లక్ష్మీబాయి బ్రిటిష్ వారిని ఎదిరించిన వీర వనిత అని, లార్డ్ డల్హౌసి రాజ్య సంక్రమణ సిద్ధాంతానికి వ్యతిరేకించి పోరాడిన వీరవనిత అని,మహిళలలో ఆత్మస్థైర్యాన్ని నింపిన ధైర్యశాలిగా, ప్రతి ఒక్క మహిళ ఝాన్సీ లక్ష్మీబాయిని ఆదర్శంగా తీసుకోవాలని గ్రామ ప్రజలు కొనియాడారు.

## బిజెపి స్టేట్ చీఫ్‌ను కలిసిన జిల్లా సోషల్ మీడియా ఇంచార్జీలు

**వడ్డేపల్లి, నవంబరు19 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర బిజెపి అధ్యక్షులు రామచంద్రరావుని వడ్డేపల్లి మండలానికి చెందిన బిజెపి జిల్లా సోషల్ మీడియా ఇంచార్జి బాధ్యులు వేణుగోపాల్ రెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు హైదరాబాదులో రాష్ట్ర కార్యాలయంలో బిజెపిఆధ్వర్యంలో నిర్వహించిన సోషల్ మీడియా ఇంచార్జీల సమావేశ కార్యక్రమంలో వారు కలిశారు. ఈ సందర్భంగా బీజేపీ చేపట్టిన పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలను సోషల్ మీడియాలో ప్రజలకు చేరువ చేయాలని అలాగే పార్టీపై చేస్తున్న దుష్ప్రచారాన్ని ఎండగట్టి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని రాష్ట్ర అధ్యక్షులు తెలిపినట్లు ఆయన అన్నారు.

## నరిగె యాదయ్యను సన్మానించిన దళిత నాయకులు

**రాజాపూర్, నవంబరు 19 ప్రభాతవార్త:** భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ మీద జరిగిన దాడిని ఖండిస్తూ పద్మశ్రీ మందకృష్ణ మాదిగా పిలుపుమేరకు ఢిల్లీలోని జంతర్ మంతర్ దగ్గర జరిగిన దళిత ఆత్మగౌరవ ప్రదర్శన సభలో పాల్గొని రాజాపూర్ మండలం చొక్కంపేట గ్రామానికి చేరుకున్న ఎమ్మార్పిఎస్ రాజాపూర్ మండల అధ్యక్షులు నరిగె యాదయ్యను బుధవారం చొక్కంపేట దళిత నాయకులు శాలువాకప్పి ఘన స్వాగతం పలికారు. యాదయ్యను సన్మానించిన వారిలో గ్రామ మాజీ సర్పంచ్ మంచాల కృష్ణయ్య, నాయకులు మంచాల మల్లేష్, రాజు,శాంతయ్య, చెన్నయ్య, నర్సింలు, రాములు, రాంచంద్రయ్య తదితరులు ఉన్నారు.

## విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించిన ఎంఈఓ

**లింగాల, నవంబరు19 ప్రభాతవార్త:** మండలంలోని కోమటికుంట, ధారారం పాఠశాలలను బుధవారం ఎంఈఓ బషీర్ అహ్మద్ ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. పాఠశాలలకు సంబంధించిన రికార్డులను ఆయన పరిశీలించారు. పాఠశాలలోని ఉపాధ్యాయులు టీచింగ్ డైరీ ప్రకారం విద్యాబోధన చేయాలని సూచించారు. ఎస్ఎ వన్ మార్కులను అంతర్జాలంలో నమోదు చేయాలని సూచించారు.ఎఫ్ఆర్ఎస్ హాజరుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతున్న హన్మేష చారి కుమారుడిని పరామర్శించిన ఎమ్మెల్యే

**దేవరకద్ర, నవంబరు 19 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ధన్వంతరి హాస్పిటల్‌లో రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న దేవరకద్ర మండల పరిధిలోని రాజమూర్ ఆంజనేయ స్వామి దేవాలయ అర్చకులు హనుమేష చారి కుమారుడిని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి పరామర్శించారు. బుధవారం చికిత్స పొందుతున్న హనుమేసాచారి కుమారుని వైద్య సేవలగురించి వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ధన్వంతరి హాస్పిటల్ వైద్యులతో మాట్లాడారు. అనంతరం హెచ్‌ఎంటీవీ ఉమ్మడి జిల్లా స్టాపర్ నరేంద్ర చారిని పరామర్శించి, మనోధైర్యం కల్పించిన దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి,కౌకుంట్ల మండల అధ్యక్షులు రాఘవేందర్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ కుమార్‌రెడ్డి, శివకుమార్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి ఏపీ మిథున్‌రెడ్డి, దేవరకద్ర మండల అధ్యక్షులు అంజిల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత నియమాలు పాటించాలి : సీఐ

**మద్దూర్, నవంబరు 19 ప్రభాతవార్త :** జిల్లా ఎస్పీ డా.వినీత్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ ఎస్ఐ కృష్ణ చైతన్య, మద్దూర్ ఎస్సై విజయ్ కుమార్‌లతో కోస్గి ఇన్స్‌పెక్టర్ సైదులు కలిసి మద్దూర్ మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామాన్ని సందర్శించి ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలో వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు అవసరమైన ప్రదేశాల్లో సరైన బారికేడింగ్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా కోస్గి సీఐ సైదులు మాట్లాడుతూ ట్రాఫిక్ రూల్స్‌ను ఉల్లంఘించే వాహనదారులపై స్పాట్ చలాన్లు విధించినట్లు తెలిపారు. ప్రజలందరూ రోడ్డు భద్రతను కాపాడేందుకు ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని, ముఖ్యంగా రోడ్డు ప్రమాదాల నివారణకు మితిమీరిన వేగంతో వాహనాలు నడపరాదని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, వాహనదారులు హెల్మెట్ సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని సీఐ తెలిపారు.

# మాజీ ప్రధాని ఇందిరాగాంధీకి ఘన నివాళి

### ఉక్కు మహిళ స్వర్గీయ ఇందిరాగాంధీ : వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి






**వనపర్తి, నవంబరు 19 ప్రభాతవార్త:** భారతదేశపు మొట్టమొదటి మహిళా ప్రధానమంత్రి స్వర్గీయ ఇందిరా గాంధీ దేశ అభివృద్ధి కోసం ఎన్నో సంస్కరణలు చేపట్టి నిరుపేదల అభ్యున్నతికి వెన్ను దన్నుగా నిలిచి ఉక్కు మహిళగా పేరుగాంచారని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా బుధ వారం వనపర్తి పట్టణం ఇందిరా పార్క్‌లో ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గరీబి హటావో అని నినందించి సీలింగ్ యాక్ట్‌ను తీసుకువచ్చి భూమిలేని నిరుపేదలకు సాగు భూమిని అందించి నిరుపేదల అభ్యున్నతికి పాటు బడ్డారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. బ్యాంకులను జాతీయీకరణ చేసి నిరుపేదలకు బ్యాంకు సేవలను అందుబాటులోకి తెచ్చారన్నారు. హరిత విప్లవం తీసుకొచ్చి పంటలు దిగుబడిపెంచి అన్నదాతల శ్రేయస్సు కోసం పాటుపడిన వ్యక్తి ఇందిరా గాంధీ అని ఆయన అన్నారు. కార్యక్రమంలో వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, వనపర్తి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చీర్ల విజయ్ చందర్, మాజీ మున్సిపల్ చైర్మన్ పుట్టపాకుల మహేష్, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

**వెల్దండ, నవంబర్ 19 ప్రభాతవార్త:** విప్లవత్మాక సంస్కరణలతో దేశాన్ని ప్రగతి పథంలో నడిపించిన దర్శనీకురాలు, భారతదేశ తొలి మహిళా ప్రధాని భారతరత్న ఇందిరాగాంధీ దేశానికి చేసిన సేవలు ఎప్పటికీ మరువలేనివని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో మాజీ ప్రధాని ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఆమె విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ బ్యాంకులను జాతీయం చేయడంతో పాటుపేదలకు భూమిపై హక్కును కల్పించి పేదల అభ్యున్నతికై అహర్నిశలు కృషి చేశారన్నారు. దేశానికి చేసిన సేవలు ప్రజలు ఎప్పటికీ మర్చిపోరని అన్నారు. కార్యక్రమంలో వెల్దండ మాజీ సర్పంచి యెన్నం భూపతిరెడ్డి,మార్కెట్ కమిటీ చైర్మన్ ఉమా సంజీవ్‌యాదవ్, మండల పార్టీ అధ్యక్షులు మోతిలాల్ నాయక్, కిసాన్ సెల్ అధ్యక్షులు పర్వత్ రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్యా గౌడ్, తిరుపతిరెడ్డి, హమీద్,అలీ, ఎర్ర శ్రీను ముదిరాజ్,నాగేశ్వర్ గౌడ్, పుల్లయ్యా, రమేష్, కిష్టాలు, భరత్‌గౌడ్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

**ధన్వాడ, నవంబరు 19 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ధన్వాడలో మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ధన్వాడ మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. ధన్వాడ పట్టణ అధ్యక్షుడు జట్రం లక్ష్మయ్య గౌడ్ ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాల వేశారు. ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకుడు చిట్టెం మాధవ రెడ్డి, గాజుల శివకుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు ఆమె సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా గాజుల శివకుమార్ మాట్లాడుతూ దేశం నేడు అభివృద్ధి పథంలో ముందుకు సాగడానికి మాజీ ప్రధాని ఇందిరాగాంధీ తీసుకున్న పరిపాలన నిర్ణయాలే పునాది" అన్నారు. బడుగు–బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రారంభించారని, రాజాభరణాల రద్దు, బ్యాంకుల జాతీయీకరణ, రూపాయి విలువ నిర్ధారణ వంటి ప్రజాహిత నిర్ణయాలు దేశదిశను మార్చేశాయని పేర్కొన్నారు.కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**నారాయణ పేట, నవంబరు19 ప్రభాతవార్త:** నారాయణ పేట జిల్లా కేంద్రంలో సివిఆర్ భవన్‌లో మార్కెట్ కమిటీ చైర్మ న్ సదాశివారెడ్డి మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించారు. కార్యక్రమానికి ప్రముఖ నాయకులు, విభాగాల ప్రతినిధులు హాజరయ్యారు. మాజీ మార్కెట్ చైర్మన్ బండి వేణుగోపాల్ పాల్గొని ఇందిరాగాంధీ సేవలను స్మరించారు. పట్టణ అధ్యక్షుడు ఎండి సలీం, ఆర్టీవో బోర్డ్ డైరెక్టర్ పోషల్ రాజేష్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కోట్ల మధుసూదన్ రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ బోయ శరణప్ప,మైనారిటీ సెల్ జిల్లాఅధ్యక్షులు మహిమూద్‌ఖురేషి, యూత్ పట్టణ అధ్యక్షుడు యూసఫ్ తాజ్ పల్లా, అనిల్, ఎరుకలి వెంకటయ్యా, సదతుల్లాహ్, సూర్యకాంత్, రవికిరణ్ పాల్గొన్నారు.

**నవాబుపేట, నవంబరు19 ప్రభాతవార్త:** ఢిల్లీలోని శక్తిస్థల్‌లో భారత తొలి మహిళ ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ 108వ జయంతి వేడుకల్లో నవాబుపేట మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.జాతీయ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీలను మర్యాద పూర్వకంగా కలిసి ఇందిరాగాంధీ 108వ జయంతి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మైదానం ప్రాంత సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షులు రఘురామ్ రాథోడ్, సేవాలాల్ సేన రాష్ట్ర నాయకులు నేనావత్ అజయ్ నాయక్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేతావత్ రాజ్ కుమార్‌నాయక్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

**రాజాపూర్, నవంబరు19 ప్రభాతవార్త:** భారతదేశ ప్రథమ మహిళా ప్రధానమంత్రి, ఉక్కు మహిళ, దేశ సేవకోసం తన జీవితాన్నే అంకితం చేసిన మహనీయురాలు స్వర్గీయ ఇందిరాగాంధీ అని ఏఎంసీ వైస్ చైర్మన్ జవాజి శేఖర్ గౌడ్ అన్నారు. బుధవారం ఆమె జయంతి సందర్భంగా రాజాపూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆమె చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆమె దేశం కోసం చేసిన పలు సేవా కార్యక్రమాలనుగుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యూత్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య బీమా ప్రతి ఒక్కరి జీవితానికి ధీమానిస్తుంది

◆ అదనపు ఎస్పీ ఎండి రియాజ్ హుల్ హక్

**నారాయణ పేట, నవంబరు19 ప్రభాతవార్త :** నారాయణపేట పోలీస్ కార్యాలయంలో హోం గార్డ్ సిబ్బందికి ఆరోగ్య ప్రమాద భీమాపై హెచ్‌డిఎఫ్‌సి, యాక్సిస్ బ్యాంకుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.జిల్లా ఎస్పీ డా.వినీత్ సూచనలతో జరిగిన ఈ కార్యక్రమానికి అదనపు ఎస్పీ ఎం.డి. రియాజ్ హుల్ హక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బ్యాంక్ అధికారులు సంవత్సరానికి రూ.11,650 ప్రీమియం చెల్లిస్తే కుటుంబంలోని నలుగురికి రూ.33 లక్షల ఆరోగ్య భీమా వర్తిస్తుందని తెలిపారు. అలాగే శాలరీ అకౌంట్, డెబిట్ కార్డు వినియోగం ఉంటే ప్రమాదవశాత్తు మరణించిన పక్షంలో రూ.30 లక్షల ఆర్థిక భీమా అందుతుందని వివరించారు. ప్రస్తుత కాలంలో ఆరోగ్య భీమా ప్రతి కుటుంబానికి రక్షణ కవచమని అదనపు ఎస్పీ సూచించారు. అనధికార లోన్ యాప్‌లలోరుణాలు తీసుకోకుండా జాగ్రత్తగా ఉండాలనిఆయన హెచ్చరించారు. కార్యక్రమంలోఆర్ ఎస్ఐ మద్దయ్యా, శ్వేత, శిరీషతో పాటు బ్యాంక్ అధికారులు, హోంగార్డ్ సిబ్బంది పాల్గొన్నారు.

## కేటీఆర్‌ను కలిసి బాసు హనుమంతు నాయుడు

**గద్వాల టౌన్, నవంబర్ 19, ప్రభాతవార్త:** హైదరాబాద్ లోని నందినగర్ లో మాజీ మంత్రి బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను బాసు హనుమంతు నాయుడు మర్యాద పూర్వకంగా కలిశారు.బుధవారం కేటీఆర్‌ను కలిసి గద్వాల నియోజకవర్గంలో వున్న సమస్యలపైను వివరించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వంలో బిఆర్ యస్ పార్టీ చేసిన అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లి గెలుపే ధ్యేయంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని ఆదేశించారు. అనంతరం త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చించారు. గద్వాల నియోజకవర్గంలో బిఆర్‌యస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు.

## బాల్య వివాహాల నిర్మూలన సమష్టి బాధ్యత

◆ నారాయణ పేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్


**నారాయణ పేట, నవంబరు19 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లాను బాల్యవివాహ రహిత జిల్లాగా మార్చేందుకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మరియు జిల్లా బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో బాలల రక్షణ, విద్య,సంరక్షణను ప్రతిబింబించే లోగోను కలెక్టర్ తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై గ్రామస్థాయిలో అవగాహనపెంచాలని ఆమె సూచించారు. ఈ సమస్యను అరికట్టేందుకు ప్రభుత్వ విభాగాలు, ఎన్జీవోలు ప్రజా ప్రతినిధులు, సమాజం కలిసి పని చేయాల్సిన అవసరాన్ని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వార్, శ్రీను, ఆర్డిఓ రామ్ చందర్, డిప్యూటీ కలెక్టర్లు శ్రీరామ్ ప్రణీత్, ఫణికుమార్, డీపీఆర్వో రషీద్, భగీరథ ఈఈ రంగారావు తదితరులు పాల్గొన్నారు.



# మహిళల ఉన్నతి తెలంగాణ ప్రగతి

◆ ప్రతి నిరుపేద మహిళకు ఇందిరమ్మ చీరల పంపిణీ
◆ వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**వనపర్తి, నవంబరు 19 ప్రభాతవార్త:** మాజీ దివంగత ప్రధాని, స్వర్గీయ ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నిరుపేద మహిళకు ఇస్తున్న ఉచిత చీర పంపిణీ కార్యక్రమం వనపర్తి జిల్లాలో పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఎపియంలు, మహిళా సంఘాల అధ్యక్షులను ఆదేశించారు. బుధవారం ఇందిరా మహిళాశక్తి చీరల పంపిణీ కార్యక్రమంపై రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి సీతక్క,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ కృష్ణా రావుతో కలిసి జిల్లా కలెక్టర్లు, మహిళా సమాఖ్య సభ్యులతో వీడియో కాన్ఫరెన్స్‌ద్వారా దిశా నిర్దేశం చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ నవంబర్ 19న స్వర్గీయ మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా రాష్ట్రంలోని కోటి మంది మహిళలకు కోటి ఇందిరమ్మ చీరల పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఆడబిడ్డలకు సారె, చీర పెట్టడం తెలంగాణ సంప్రదాయం ఇందులో భాగంగా ఆడబిడ్డలకు ఇందిరమ్మ చీరలను పంచాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది అన్నారు. ఇందిరమ్మ చీరల పంపిణీ ప్రక్రియకు సంబంధించి ప్రతీ నియోజకవర్గానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించాలని నియోజకవర్గాల్లోని అన్ని మండల కేంద్రాల్లో డిసెంబర్ 9లోగా విడతల వారీగా ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం చేపట్టాలన్నారు. ఒక పండగ వాతావరణంలో 18 సంవత్సరాల వయస్సు దాటిన ప్రతి పేద మహిళకు ఒక్కొక్కటి చొప్పున ఇందిరమ్మ చీర పంపిణీ చేయాలని సూచించారు.మహిళల ఉన్నతి తెలంగాణ ప్రగతి కార్యక్రమం పేరుతో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమ చేపట్టాల్సిందిగా సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయాలనే ఉద్దేశ్యంతో మహిళలకు అనేక అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వామ్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం కల్పించడమే కాకుండా వాటికి మహిళలను యజమానులను చేశామన్నారు. స్కూల్స్‌లో యూనిఫారం కుట్టే కుట్టుపని బాధ్యత మహిళా సంఘాలకే అప్పగించాం, ఇందిర మ్మ క్యాంటీన్లు, శిల్పారామంలో 3 ఎకరా ల్లో ఇందిరా మహిళా శక్తి బజార్ ఏర్పాటు చేశామని తెలిపారు. మహిళ ఉత్పత్తుల ఆన్ లైన్ మార్కెట్ కోసం అమెజాన్‌తో సంప్రదింపులు చేస్తున్నామని చెప్పారు. జాతీయ,అంతర్జాతీయ స్థాయిలో మహిళలు తయారు చేసిన ఉత్పత్తులకు గుర్తింపు తెచ్చే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఇటీవల నిర్వహించిన కుటుంబ సర్వే డేటా ఆధారంగా పూర్తి వివరా లతో ప్రతీ మహిళకు ఇందిరమ్మ చీరలు అందేలా అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలనీ ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇవాల్టి నుంచి డిసెంబర్ 9 వరకు ఇందిరమ్మ చీరల పంపిణీ ఉంటుంది. మార్చి 1నుంచి 8 వరకు పట్టణ ప్రాంతాల్లో ఇందిరమ్మ చీరల పంపిణీ ఉంటుంది. వివాదాలకు తావు లేకుండా ఇందిరమ్మ చీరల పంపిణీ ప్రక్రియ పూర్తి చేయాలనీ, ప్రజా ప్రతినిధులను భాగస్వాములను చేయాలని సూచించారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ మహిళల గౌరవం పెంచే విధంగా 18 సంవత్సరాల వయస్సు నిండిన ప్రతి మహిళకు ఇందిరా మహిళా శక్తి చీర ఇవ్వనున్నట్లు చెప్పారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఆర్టీసీబస్సులు, సోలార్ పవర్, పెట్రోల్ బంక్ ఏర్పాటు, మహిళా క్యాంటీన్లు, దాదాపు 10 సంవత్సరాల తర్వాత వడ్డీ లేని రుణాల పంపిణీ కార్యక్రమం జరుగుతుందన్నారు. అవకాశం ఉన్న ప్రతి రంగంలో వ్యాపారం చేసుకునేందుకు మహిళలకు అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క మాట్లాడుతూ భారత దేశ మొదటి మహిళా ప్రధాని ఇందిరా గాంధీని స్ఫూర్తిగా తీసుకొని ఆకాశమంత ఎత్తుకు ఎదిగేందుకు నీలి రంగు చీరలను మహిళలకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మహిళల సాధికారత కొరకు సెర్ప్ తీసుకురావడం జరిగిందని, బయట అధిక వడ్డీ కి రుణాలు తీసుకొని ఆర్థికంగా నష్టపోకుండా అతి తక్కువ బ్యాంకు వడ్డీకే రుణాలు ఇప్పించడం సెర్ప్ ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ వనపర్తి జిల్లాలో 86,732 మంది మహిళా సంఘం సభ్యులు ఉంటే జిల్లాకు 89,516 చీరలు వచ్చినట్లు తెలిపారు. మహిళా సంఘములో లేని వారిని కూడా సంఘంలో చేర్చుకునే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మరిన్ని చీరలు తెప్పించి ఎలాంటి సమస్యలు లేకుండా ప్రతి మహిళకు చీర పంపిణీ చేసే విధంగా షెడ్యూల్ సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. డిపిఓ తరుణ్ చక్రవర్తి, డీఆర్డీఓ కార్యాలయం నుండి అడిషనల్ డిఆర్డీఓ సరోజ, జిల్లా మహిళా సమాఖ్య చైర్మన్ స్వరూప, మండల మహిళా సంఘాల అధ్యక్షులు, ఏపీఎంలు తదితరులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లను ఆదేశిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

# ధాన్యం గోదాంలు నిర్మిస్తాం

### రైతు చెంతకే మొక్క జొన్న కొనుగోలు కేంద్రాలు : ఎక్సైజ్, టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

**చిన్నంబావి, నవంబరు19 ప్రభాతవార్త:** మండల పరిధిలోని కొప్పునూర్ గ్రామానికి చెందిన పెద్దనట్టు భూమిలు పెంట్లవెల్లి మండలం జటప్రోల్ గ్రామ రెవెన్యూ శివారులో గల భూమిలో గ్రామ రైతుకమిటి పేరు మీద ఏసీగోదాం, ఇండస్ట్రియల్ పార్క్ నిర్మాణం చేపడతామని ఎక్సైజ్ టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని అయ్యవారిపల్లిలో, కొప్పునూరు గ్రామ ప్రజలతో కలిసి మంత్రి జూపల్లి పెద్దనట్టు భూమిలో ఏర్పాటు చేసిన మొక్క జొన్న కొనుగోలు కేంద్రంను ప్రారంభించారు.అనంతరం మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ రైతు చెంతకే మొక్క జొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని, రైతులుఎవరు ఆధైర్య పడోద్దని, ఖరీఫ్ సీజన్‌లో చేతికి వచ్చిన వివిధ రకాల ధాన్యంను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని మంత్రి జూపల్లి అన్నారు.కొప్పునూరు గ్రామ ప్రజల ఆస్తి పెద్దనట్టు భూములు 116 ఎకరాలు గ్రామ ప్రజల సమిష్టి ఆస్తి అనిఎవరికీ అక్రమంగా చెందదని, అక్రమార్కులు ఎవరైనా ఆక్రమించాలని ప్రయత్నిస్తే, చట్టపరంగా క్రిమినల్ చర్యలు చేపడతామని, కోర్టులో వేసిన కేసులను ప్రభుత్వ రెవెన్యూ అధికారుల ద్వారా రిపోర్ట్‌లు కోర్టుకు పంపించి భూమికి సంబంధించి కేసులు కొట్టి వేయడం జరిగిందని పెద్దనట్టు భూమికొప్పునూర్ గ్రామ ప్రజలకె చెందినట్లు తీర్పు రావడం జరుగుతుందని అన్నారు. గ్రామ ప్రజలు ఏవరు కూడా అపోహలను నమ్మవద్దని అన్నారు. త్వరలోనే పెద్దనట్టులో ప్రజలకు రైతులకు ఉపయోగకరమైన వ్యవసాయ ధాన్యం గోదాముల ఏర్పాటు చేస్తామని మంత్రి హామీ ఇవ్వడం జరిగింది. అలాగే గ్రామ రైతుకమిటి సభ్యులు ప్రజలపై వేసిన కేసులు కూడా కోర్టు పరంగా పరిష్కరించుకుందామని అన్నారు. అలాగే చిన్నంబాయి మండలం పెద్ద దగడ గ్రామ శివారు చిన్నంబావి చౌరస్తాలో ఉన్న భూములు నాటి జటప్రోల్ సంస్థానం కవి మఠం రామయ్యకు ఇచ్చిన ఇనాంభూములని, వాటిపైన ఎండోమెంట్ అధికారులకు, వారి వారసులకు, రైతులకు హై కోర్టులో కేసు నడుస్తుందని, వీటిపైన కూడా చట్టం ప్రకారం రైతులకు న్యాయం జరుగుతుందని అన్నారు. కొందరు రైతులకు భూ నష్ట పరిహారం కింద పలు కేసులలోవారసులకు, రైతులకు నష్ట పరిహారం వచ్చాయని ఇనాం భూములను ఎండోమెంట్ భూములంటూ తప్పుడు ప్రకటనలు చేస్తూ వారిని ఇబ్బందుల పాలు చేస్తున్నారని అన్నారు. కొందరు అతి ఉత్సాహం ప్రదర్శిస్తూ అక్కడ నివసించే ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని వారికి కూడా త్వరలోనే చట్టపరంగా బుద్ధి చెబుతామని మంత్రి జూపల్లి అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతు కమిటి సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



మొక్కజొన్న ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న మంత్రి జూపల్లి

### ప్రపంచ వారసత్వ సంరక్షణ చరిత్రలో

# నిలిచిన అద్భుత కీర్తి అలంపూర్ దేవాలయాలు

**శిల్ప వైభవాన్ని ప్రతిబింబించే ఆలయ వారసత్వాన్ని కాపాడాలి**
**భవిష్యత్తు తరాలకు సురక్షితంగా అందించడం మన బాధ్యత**
**గద్వాల జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్**

**గద్వాల టౌన్ నవంబర్19, ప్రభాతవార్త:** అలంపూర్ దేవాలయాల వంటి మన సంస్కృత,శిల్ప వైభవాన్ని ప్రతిబింబించే ఈ అమూల్య ఆలయ వారసత్వాన్ని కాపాడి భవిష్యత్ తరాలకు సురక్షితంగా అందించడం మనందరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ అన్నారు.బుధవారం ఆర్కియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ప్రపంచ వారసత్వ వారోత్సవాలు సందర్భంగా అలంపూర్ లోని కుడవల్లి సంగమేశ్వర దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శన ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచ వారసత్వవారం కార్యక్రమం మానవ నాగరికతకుమూలా ధారమైన విలువలను సంరక్షించే సమిష్టి బాధ్యతకు ప్రతీక అని తెలిపారు. నవంబర్ 19 నుండి 25 వరకు జరిగే ఈ వారోత్స వాల ప్రధాన లక్ష్యం ప్రజల్లో చారిత్రక అవగాహన పెంపొందించడం,వారసత్వ స్థలాలను తెలుసుకునే అవకాశం కల్పించడం అని వివరించారు. అలంపూర్ ప్రాంతం నవబ్రహ్మ ఆలయాలు,పాపనాశి దేవాలయ సముదాయం,జోగులాంబ శక్తి పీఠం,సంగమేశ్వర ఆలయంతో అపూర్వమైన ఆధ్యాత్మిక,చారిత్రక,శిల్పకళా వైభవాన్ని కలిగిన పుణ్యక్షేత్రంగా నిలిచిందనితెలిపారు.ఫోటో ప్రదర్శనను పరిశీలించిన కలెక్టర్,అలంపూర్ దేవాలయాల పునఃస్థాపనను ప్రపంచ వారసత్వ సంరక్షణ చరిత్రలో అరుదైన మరియు ఆదర్శ ప్రాయమైన కృషిగా అభివర్ణించారు.శ్రీశైలానికి సమీపంలోని ఈ ప్రాచీన దేవాలయాలు కృష్ణానది పునర్నిర్మాణ పనులవల్ల మునిగే ప్రమాదంలో పడినప్పుడు,ఒక్కో రాతి భాగాన్ని గుర్తించి,శాస్త్రీయ విధానాలతో విడదీసి,అసలు రూపం చెదరకుండా కొత్త ప్రదేశంలో పునర్నిర్మించడం అత్యంత క్లిష్టమైన ఇంజినీరింగ్, శిల్ప నైపుణ్యంతో సాధ్యమైందని ఆయన ప్రశంసించారు. ఆర్కియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాఈ ప్రక్రియలో చూపిన నిబద్ధత,శాస్త్రీయ దృక్పథం, శిల్పకళపై చూపిన గౌరవాన్ని ప్రత్యేకంగా అభినందించారు.పాత దేవాలయాలు ఉన్న స్థితి నుంచి కొత్త ప్రదేశంలో వాటి ప్రతిష్ఠాపన వరకు జరిగిన ప్రతిదశను ఫోటోలద్వారా అందంగా ప్రతిబింబించినందుకు ఆర్కియాలాజికల్ అధికారులను ఆయన మెచ్చుకున్నారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ,అలంపూర్ దేవాలయాలు వంటి పురాతన నిర్మాణాలు మన సంస్కృతి, శిల్పకళ, ఇంజినీరింగ్‌ప్రతిభకు ప్రత్యక్ష సాక్ష్యాలని పేర్కొన్నా రు.ఇవి పుస్తకాలలో మాత్రమే కాకుండా, ప్రత్యక్షంగా చూసి నేర్చుకోవడం ద్వారా నిజమైన అవగాహన వస్తుందని చెప్పారు. సంస్కృతి–వారసత్వంపై జ్ఞానం ప్రభుత్వ ఉద్యోగ పరీక్షల్లో కూడా కీలకం కావడంతో,విద్యార్థులు ఈ విషయాలను పూర్తిగా నేర్చుకోవాలని సూచించారు. చారిత్రక స్మారకాలను కాపాడటం ప్రతి పౌరుడి మౌలిక బాధ్యత అని గుర్తు చేశారు.పాఠశాలలో కూడా విద్యార్థుల్లో వారసత్వంపై ఆసక్తి పెంచేందుకు స్పీచ్, క్విజ్ వంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.తుంగభద్ర–కృష్ణానదుల సంగమ ప్రాంతంలో ఉన్న సంగమేశ్వర ఆలయం ఆధ్యాత్మిక, చారిత్రక, శిల్పకళా మహిమాన్విత క్షేత్రమని, ఇలాంటి అమూల్య వారసత్వాన్ని కాపాడి భవిష్యత్ తరాలకు అందించడం మనందరి అత్యంత ముఖ్య బాధ్యత అని కలెక్టర్‌గారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఆర్కియాలజిస్ట్ ఎన్. నిహిల్ దాస్,డిప్యూటీ సూపరింటెండెంట్ ఆర్కియాలజిస్ట్ హెచ్.ఆర్. దేశాయి ,అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆర్కియాలజిస్ట్ రోహిణి పాండే,డిప్యూటీ సూపరింటెండెంట్ఆర్కియాలజికల్ ఇంజినీర్ కృష్ణ చైతన్య, అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆర్కియాలజికల్ ఇంజినీర్ పి.కిషోర్ కుమార్‌రెడ్డి ,అసిస్టెంట్ ఆర్కియాలజిస్ట్ సాయి కృష్ణ, కన్జర్వేషన్ అసిస్టెంట్, అలంపూర్ దేవాలయాలు యు.వెంకటయ్య, తహసీల్దార్ మంజుల, మాంటిస్సోరి విద్యార్థులు పాల్గొన్నారు.



ఫోటో ప్రదర్శనశాలను ప్రారంభోత్సవం చేస్తున్న కలెక్టర్ సంతోష్





# సీఎంను కలిసిన ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

**జడ్చర్ల, నవంబరు 19 ప్రభాతవార్త:** ఉదండాపూర్ నిర్వాసితుల ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీకి సంబంధించిన ఫైలును రాబోయే కేబినెట్ మీటింగ్‌లో పెట్టి ఆమోదించాలని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి సీఎం రేవంత్ రెడ్డిని కోరారు. ఈ మేరకు బుధవారం సీఎంను ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా హైదరాబాద్‌లో కలిశారు. ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిన తర్వాత కొంత మంది ఇంటి నిర్మాణానికి పునాదులు వేసుకోగా అవి ఇందిరమ్మ యాప్‌లో అప్‌లోడ్ కాకపోవడం వల్ల వారికి బిల్లులు ఆగిపోయాయని, ఈ సమస్యను ఎదుర్కొంటున్న వారి వివరాలను జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి పంపడం జరిగిందని, ఇందిరమ్మ యాప్‌లో ఉన్న సాంకేతిక సమస్యలు తొలగించి ఆ బిల్లులను సత్వరమే క్లియర్ చేయాలని కోరారు. రాజాపూర్ మండలం ఖానాపూర్ గ్రామంలో తన తాత దేశ్‌ముఖ్ పేరిట ఉన్న భూమిని రైతుల పేరిట మార్చడానికి ఇప్పటికే జిల్లా కలెక్టర్ ప్రతిపాదనలు పంపారని, వాటిపై వెంటనే చర్యలు తీసుకొని రైతులకు న్యాయం చేయాలని అక్కడే ఉన్న రాష్ట్ర గృహ నిర్మాణ, రెవెన్యూ శాఖల మంత్రి పొంగులేటిని కోరారు.



రక్తదానం చేస్తున్న యువత

## రక్తదాన శిబిరం విజయవంతం

**పెబ్బేరు, నవంబరు 19 ప్రభాతవార్త :** బిసి పొలిటికల్ జెఏసి స్టేట్ చైర్మన్ డాక్టర్ రాచాల యుగంధర్ గౌడ్ జన్మదిన వేడుకలను ఆయనఅభిమానులు ఘనంగా నిర్వహించారు.బుధవారం రాచాల జన్మదినాన్ని పురస్కరించుకుని పెబ్బేరు పట్టణంలోని సాయిరాం ఫంక్షన్ హాలులో నిస్వార్థ ఆర్గనైజేషన్, రాచాల యుగంధర్ బీసీ పొలిటికల్ జెఏసి సంయుక్తంగా మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. రక్తదాన శిబిరంలో రాచాల అభిమానులు యువకులు పెద్ద ఎత్తున స్వచ్ఛందంగా పాల్గొని 114 యూనిట్లు రక్తదానం చేశారు. జిల్లా వ్యాప్తంగా యువత మహిళలు పెద్ద ఎత్తున తరలి వచ్చి రాచాల యుగందర్ గౌడ్‌కు శాలువాలతో సన్మానించి పూల మాలలు వేసిజన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా అభిమానులను ఉద్దేశించి రాచాల మాట్లాడుతూ బిసి పొలిటికల్ జెఏసి సమాజంలో ఉన్న అన్ని వర్గాల ప్రజలకు ఎల్లప్పుడు అండగా ఉంటుందని, భావితరాల భవిష్యత్ కోసం అనునిత్యం కృషి చేస్తానన్నారు. పేద ప్రజలకు ఎక్కడ అన్యాయం జరిగినా రాకెట్ స్పీడుతో వాలిపోతానని, సమాజంలో ఉన్న అన్ని వర్గాల ప్రజలను చైతన్యం చేయడమే తన లక్ష్యమన్నారు. అన్యాయం ఎక్కడ జరిగినా అక్కడనిలబడి పోరాటం చేసి సమస్యను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామన్నారు. ప్రజల మద్దతుతో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని ఏదో ఒక నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచి ప్రజలకు మరింత సేవ చేస్తామని స్పష్టం చేశారు. స్వచ్ఛందంగా వేలాదిగా తరలివచ్చి తనను ఆశీర్వదించినఅభిమానులకు,శ్రేయోభిలాషులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం నిస్వార్థ ఆర్గనైజేషన్ సిబ్బందిని నిర్వాహకులు సన్మానించారు. అంతకుముందు ఆయన స్వగ్రామం వడ్డెవాట గ్రామంలో తల్లి నాగేంద్రమ్మ ఆశీర్వాదం తీసుకుని అనంతరం బీచుపల్లి ఆంజనేయస్వామిని దర్శించుకుని అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిస్వార్థ ఆర్గనైజేషన్ సిబ్బందితో పాటు నిర్వాహకులు వివిగౌడ్, రాఘవేందర్, దేవర శివ, అంజన్న యాదవ్, మహేందర్ నాయుడు, ధర్మేంద్ర సాగర్, బత్తుల జితేందర్, సూగూరు రాజశేఖర్, సితార వెంకటేశ్వర్లు, శ్రీనివాస్‌గౌడ్, రంగస్వామి వివిధ పార్టీల నాయకులు, కుల సంఘాల నాయకులు మహిళలు పాల్గొన్నారు.

## రైస్ మిల్లుకు తాళం వేసిన తహసీల్దార్



రైస్ మిల్లును తనిఖీ చేస్తున్న తహసీల్దార్

**మాగనూర్, నవంబరు 19 ప్రభాతవార్త :** మండల పరిధిలోని వర్కూర్ గ్రామ సమీపంలో ఉన్న ఎంఎస్ఆర్ రైస్ మిల్‌కు బుధవారం మాగనూర్ తహసిల్దార్ సురేష్ కుమార్ తాళం వేశారు. మిల్లు వే బ్రిడ్జ్‌లో అవకతవకలు ఉన్నాయని దీంతో రైతులకు తీరం నష్టం జరుగుతుందని, రైతులు జిల్లా సివిల్ సప్లై డిఎం సైదులు దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన ఆదేశాలతో తనిఖీ చేసినట్లు తెలిపారు. ఆమిల్లుకు కేటాయించిన క్వాంటిటీ పూర్తి కావడంతో మిల్లుకు తాళం వేసినట్టు తెలిపారు. తూనికల శాఖ అధికారులు తనిఖీలు చేపట్టిన తర్వాతనే మళ్లీ వడ్లు కొనుగోలు చేయాలని సూచించారు.రైతులను మోసంచేస్తే మిల్లు యజమానిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## జాతీయ స్థాయి ఎస్‌జిఎఫ్ పోటీలకు జిల్లా క్రీడాకారుల ఎంపిక

**నారాయణ పేట, నవంబరు 19 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన పలువురు విద్యార్థులు మండల, జిల్లా,రాష్ట్ర స్థాయి ఎస్‌జిఎఫ్ క్రీడాపోటీలలో ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారి గోవిందరాజులు వారిని శాలువాలు కప్పి సన్మానించారు. రెజ్లింగ్, ఛెస్, అథ్లెటిక్స్ క్రికెట్ వంటి విభాగాల్లో రాష్ట్రస్థాయి పోటీల్లో మెరుగైన ప్రదర్శన కనబరిచిన విద్యార్థులు జాతీయ స్థాయికి అర్హత సాధించారని డీఈవో గోవిందరాజు తెలిపారు. కేజీబీవీ ధన్వాడకు చెందిన గోత్ర డిల్లీలు అండర్ 19 రెజ్లింగ్ పోటీలలో మూడవ స్థానం సాధించి జాతీయ స్థాయికి ప్రవేశించింది. మరోవైపు ప్రభుత్వ పిహెచ్‌ఈఎస్ పాఠశాల విద్యార్థిని కూడా జాతీయ స్థాయి ఎస్‌జిఎఫ్ పోటీలకు ఎంపిక కావడం గర్వకారణమని ఆయన చెప్పారు. అదేవిధంగా అథ్లెటిక్స్ విభాగంలో జిల్లా కేంద్రానికి చెందిన ఇద్దరు క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. క్రికెట్ విభాగంలోనూ దాదాపు ఆరుగురు విద్యార్థులు అండర్ 14 జాతీయ జట్టుకు అర్హత సాధించారని డివైఎస్ఓ తెలిపారు.ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులందరికీ భవిష్యత్తులో మరింత ఎత్తుకు ఎదగాలని డిఈఓ గోవిందరాజు శుభాకాంక్షలు తెలిపారు.జిల్లా క్రీడాధికారి, పాఠశాల టీచర్లు, తల్లిదండ్రులు ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు.